నేటినిజం

తెలుగు దినపత్రిక

website:www.netinijam.com

E-mail : netinijam93@gmail.com

హైదరాబాద్ గురువారం 29-9-2022 RNI No.52865/93·Postal No\.H/SD/258/2020-2022 ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 సంపుటి:29 సంచిక: 50 పేజీలు:6 వెల: రూ.1/-

నమ్మలేని నిజాలు

బాబాకేంద్రాలు
కామన ఆశ్రమాలు
అచల చరం.

నేతలవైరం
పాలమీది మీగడ
జనం సమిధలు.

దిక్కార స్వరం
గజం చెవిలో చీమ
అహం పతనం.

గోస్తనీ పాకం
ఉత్తరాది వంటకం
చక్కర వ్యాధి.

నెట్ జీరోసౌధం
స్వవిద్యుత్ వినియోగం
ప్రకృతి హితం.

– రేడియమ్
సెల్: 9291527757

శ్రీనిజాలు

ఖాళి సీస పారేయకు
వస్తుందొక రూపాయ్!
పగలగొట్టి పట్టుకుంటె
ఆయుధమున్న సిపాయ్!

పొద్దు లేదు మాపులేదు
చెడగొట్టూ వానలు!
బిక్కచచ్చి ఇంటిమీద
నోళ్లు తెరిచె గూనలు!

– కందుకూరి శ్రీరాములు
సెల్:9440119245

నోట్లరద్దు పిటిషన్లపై అక్టోబర్ 12న వాదనలు వినన్న సుప్రీంకోర్టు

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 28: నోట్ల రద్దు రాజ్యాంగబద్ధతను సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్‌లపై సుప్రీంకోర్టు అక్టోబర్ 16న వాదనలు వినన్నది. జస్టిస్ అబ్దుల్ నజీర్ నేతృత్వంలోని ఐదుగురు సభ్యుల రాజ్యాంగ ధర్మాసనం పిటిషన్‌లపై విచారణ జరుపనున్నది. ముందుగా తెలిసిన సమాచారం ప్రకారం ఇవాళే (సెప్టెంబర్ 28న) నోట్స్ బ్యాన్ పిటిషన్‌లపై సర్వోన్నత న్యాయస్థానం వాదనలు వినాల్సి ఉంది. కానీ, కొన్ని న్యాయపరమైన కారణాలవల్ల విచారణ తేదీ అక్టోబర్ 12కు మారింది.

ప్రధాని నరేంద్రమోదీ 2016 సెప్టెంబర్ 8న పాత రూ.500, 1000 నోట్లను రద్దు చేశారు. రూ.500 నోటుకు బదులుగా కొత్త నోటును తీసుకురాగా, పాత రూ.1000 నోటును పూర్తిగా రద్దుచేశారు. దాని స్థానంలో రూ.2000 నోటును తీసుకొచ్చారు. అయితే ఈ నోట్ల రద్దు కారణంగా జనం తీవ్ర ఇబ్బందులు పడ్డారు. నగదు కోసం నిత్యం బ్యాంకుల ముందు బారులు తీరాల్సి వచ్చింది. ఇంత జరిగినా ఆ నోట్ల బ్యాన్ వల్ల ప్రభుత్వానికి, ప్రజలకు ఒరిగింది ఏమీ లేదు.

అందుకే నోట్ల రద్దుపై తీవ్ర విమర్శలు వచ్చాయి. ప్రభుత్వ తీరుపై ప్రజలు దుమ్మెత్తి పోశారు. ఈ క్రమంలోనే నోట్ల రద్దును సవాల్ చేస్తూ సుప్రీంకోర్టులో పిటిషన్‌లు దాఖలయ్యాయి. ఈ పిటిషన్‌లపై విచారణ జరిపిన సర్వోన్నత న్యాయస్థానం.. తదుపరి దర్యాప్తును రాజ్యాంగ ధర్మాసనానికి బదిలీచేస్తున్నట్లు 2016, డిసెంబర్ 16న ప్రకటించింది. కానీ, ఈ కేసుకు సంబంధించి పూర్తిస్థాయిలో రాజ్యాంగ ధర్మాసనం ఇప్పటికీ ఏర్పాటు కాలేదు.

యాదాద్రీశుని సేవలో హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సూరేపల్లి నంద

యాదాద్రి, సెప్టెంబర్ 28: యాదాద్రి లక్ష్మీ నరసింహ స్వామి వారిని హైకోర్టు న్యాయమూర్తి సూరేపల్లి నంద దర్శించుకున్నారు. మంగళవారం రాత్రి యదాద్రికి చేరుకున్న ఆమె ప్రెసిడెన్షియల్ సూట్‌లో బస చేశారు. బుధవారం ఉదయం స్వయంభూ నరసింహుడిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ సంప్రదాయ ఘన స్వాగతం పలికారు. దర్శన అనంతరం జస్టిస్ నందకు అర్చకులు ఆశీర్వచనం చేశారు. అధికారులు స్వామి వారి ప్రసాదం అందజేశారు.

ఇందిరాదేవికి నివాళులర్పించిన మంత్రి కేటీఆర్

హైదరాబాద్, సెప్టెంబర్ 28: అనారోగ్య సమస్యతో కన్నుమూసిన హీరో మహేశ్‌బాబు మాతృమూర్తి ఇందిరాదేవి భౌతికకాయానికి మంత్రి కేటీఆర్ నివాళులర్పించారు. హీరో మహేశ్ బాబు, సూపర్ స్టార్ క్రిష్ణను ఓదార్చారు. ఆమె కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఇందిరా దేవి మృతిపట్ల సంతాపం తెలిపారు. మహేశ్ కుటుంబ సభ్యులకు అండగా ఉంటామన్నారు. గతకొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఇందిరా దేవి బుధవారం ఉదయం 4 గంటలకు తుదిశ్వాస విడిచారు. ఆమె అంత్యక్రియలను ఇవాళ మధ్యాహ్నం హైదరాబాద్ జూబ్లీహిల్స్‌లోని మహాప్రస్థానంలో నిర్వహించనున్నారు.

17వ రోజుకు చేరుకున్న అమరావతి రైతుల మహాపాదయాత్ర

అమరావతి, సెప్టెంబర్ 28: అమరావతి రాజధాని కోసం అమరావతి నుంచి అరసపల్లి వరకు రైతులు చేపట్టిన మహాపాద యాత్ర 17వ రోజు ఏలూరు సమీపంలోని కొత్తూరు నుంచి ప్రారంభమైంది. నిన్న యాత్రకు విరామం ఇచ్చిన రైతులు యాత్రను ప్రారంభించారు. ఈ యాత్ర ఏలూరు నుంచి కొప్పలి వరకు 14కి.మీ మేర సాగనుంది.

పాదయాత్రకు బాపట్ల జిల్లా చందలూరు రైతులు, మహిళలు, టీడీపీ, జనసేన నాయకులు సంఘీభావం తెలిపారు. టీడీపీ నాయకుడు పట్టాభి మాట్లాడుతూ ఏపీ మంత్రి అంబటి రాంబాబు పాదయాత్ర లో పాల్గొంటున్న మహిళల గురించి అసభ్యంగా మాట్లాడడం శోచనీయమని పేర్కొన్నారు. సభ్యత, సంస్కారం లేకుండా మాట్లాడుతున్నాడని ఆరోపించారు. ఎన్ని నిరసేదాలు పెట్టినా యాత్ర ప్రజల మద్దతుతో దిగ్విజయంగా కొనసాగుతుందని తెలిపారు. అమరావతి రాజధాని విషయంలో ప్రభుత్వం మూర్ఖంగా వ్యవహరిస్తుందని దుయ్యబట్టారు.

ఘోర రోడ్డు ప్రమాదం: బస్సు-లారీ ఢీ.. 8 మంది దుర్మరణం

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 28: ఉత్తరప్రదేశ్ రాష్ట్రం లఖింపూర్ ఖేరి జిల్లాలో ఈ ఉదయం ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. ఎదురెదురుగా వస్తున్న ప్రైవేట్ బస్సు, లారీ ఒకదానికి ఒకటి ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో ఎనిమిది మంది అక్కడికక్కడే మృతిచెందారు. మరో 25 మంది గాయపడ్డారు. ప్రమాద సమాచారం తెలియగానే పోలీసులు, అధికారులు ఘటనా ప్రాంతానికి చేరుకున్నారు.

క్షతగాత్రులను చికిత్స నిమిత్తం జిల్లా ఆస్పత్రికి తరలించారు. మృతదేహాలను వాహనాల నుంచి వెలికి తీసి పోస్టుమార్టానికి పంపించారు. ప్రైవేట్ బస్సు ప్రయాణికులతో దౌరెహ్రా నుంచి లక్నోకు వెళ్తుండగా ఎదురుగా వేగంగా వచ్చిన లారీ ఢీకొట్టింది. ఎలా బ్రిడ్జికి సమీపంలో ఇసానగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఈ ప్రమాదం చోటుచేసుకుంది. ఇదిలావుంటే లఖింపూర్ ఖేరి జిల్లా ఆస్పత్రికి తరలించిన వారిలో కొందరు క్షతగాత్రుల పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన వైద్యం కోసం లక్నో ఆస్పత్రికి రిఫర్ చేశారు. కాగా ఘటనపై సీఎం యోగీ ఆదిత్యనాథ్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తంచేశారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. గాయపడిన వారికి మెరుగైన చికిత్స అందేలా చూడాలని అధికారులను ఆదేశించారు.

టీటీడీ డైరీలు, క్యాలెండర్లను ఆవిష్కరించిన ఏపీ సీఎం

తిరుమల, సెప్టెంబర్ 28: శ్రీవారి సాలకట్ల బ్రహ్మోత్సవాలలో భాగంగా తిరుమలకు వచ్చిన ఏపీ ముఖ్యమంత్రి వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డి టీటీడీ ముద్రించిన 2023వ సంవత్సరం డైరీలు, క్యాలెండర్లను ఆవిష్కరించారు. 12 పేజీల క్యాలెండర్లు 13 లక్షలు, 6 పేజీల క్యాలెండర్లు 50 వేలు, పెద్ద డైరీలు 8 లక్షలు, చిన్నడైరీలు 1.50 లక్షలు, టేబుల్ టాప్ క్యాలెండర్లు 2.50 లక్షలు ముద్రించినట్లు టీటీడీ అధికారులు వెల్లడించారు .శ్రీవారి పెద్ద క్యాలెండర్లు 3.5 లక్షలు, శ్రీ పద్మావతి అమ్మవారి పెద్ద క్యాలెండర్లు 10 వేలు, శ్రీవారు, శ్రీపద్మావతి అమ్మవారి క్యాలెండర్లు 4 లక్షలు, తెలుగు పంచాంగం క్యాలెండర్లు 2.50 లక్షల కాపీలను టీటీడీ ముద్రించిందని. క్యాలెండర్లు, డైరీలు తిరుమల, తిరుపతిలోని టీటీడీ పుస్తక విక్రయశాలల్లో అందుబాటులో ఉన్నాయని తెలిపారు. ఇతర ప్రాంతాల్లోని టీటీడీ సమాచార కేంద్రాల్లో త్వరలో అందుబాటులో ఉంచుతామని ప్రకటించారు.

పుస్తక సమీక్ష

రసరమ్య భావాలతో దోరవేటి గారి 'పద్యారాధన'

బహుగ్రంథకర్త, అభినవ దాశరథి, బహుముఖ ప్రజ్ఞాశాలి, సాహిత్యరత్న శ్రీ దోరవేటి (వి.చెన్నయ్య) గారు వెలువరించిన "పద్యారాధన" ఖండ కావ్య సంపుటిలోని పద్యాలన్నీ రసరమ్య భావాలను గుబాళింప జేసేలా కొలువుదీరాయి.. ఎంత ఎదిగినా ఒదిగి ఉండే ఉత్తమ సంస్కారాన్ని పుణికి పుచ్చుకున్న దోరవేటి గారు వివిధ సాహితీ ప్రక్రియల్లో తమ ప్రతిభను ప్రదర్శిస్తున్న తీరు బహుదా ప్రశంసనీయం... గేయాలు, కీర్తనలు, శతకాలు, ఖండకావ్యాలు, కథాసంపుటాలు, నవలలు, బుఱ్ఱకథలు, వ్యాస సంపుటులు ప్రకటించిన అనుభవమున్న ఆయన సామాజిక చైతన్యమే పరమావధిగా, ఈ దేశం పట్ల, ధర్మం పట్ల శ్రద్ధాభక్తులను ప్రబోధించడమే లక్ష్యంగా.. తమ రచనలకు జీవం పోస్తూ.. తమ రచనా వ్యాసంగాన్ని కొనసాగించడం అభినందనీయం.. పిల్లల కోసం.. ఆయన **"బూచాడొచ్చాడు"** నవల రాశారు... **"మరో శివాజీ", "అసమానవీరుడు – అనురాగ దేవత"** పేర్లతో చారిత్రక నవలలనూ వెలువరించారు. **''జీవనది'', "పయనమెచటకోయి",** సాంఘిక నవలలను సాహితీలోకానికి అందించిన ఘనత ఆయనకుంది. ప్రస్తుతం ప్రకటించిన "పద్యారాధన" ఖండకావ్య సంపుటి ఆయన లోక పరిశీలనకు.. సామాజిక చింతనకు.. అద్దం పట్టే విధంగా రూపుదిద్దుకుంది.. అభిలషణీయమైన సందేశాలు... ఔచిత్యవంతమైన పద ప్రయోగాలు.. లోకహితమైన విలక్షణమైన కవితా వస్తువులు.. దోరవేటి గారి ఖండ కావ్య సంపుటికి ఆభరణాలైనాయి... అందమైన పదాల పోహళింపు.. లయాన్వితమైన ముగింపు వంటి ప్రత్యేకతలను దోరవేటి గారి "పద్యారాధన"లో అడుగడుగునా చూస్తాం.. రస తరంగాలా సాగే ఆయన పద్యభావ ధార అందరినీ ఇట్టే ఆకట్టుకునేలా తీర్చిదిద్దడంలో ఆయన చూపిన చొరవను, శ్రద్ధను అభినందించి తీరుతాం..

అలతి అలతి పదాలతో.. అద్భుత భావ ప్రకటన చేస్తూ.. అందమైన శీర్షికలతో తీర్చిదిద్దబడిన ఇందలి పద్యాలు గొప్ప సందేశాల నివ్వడమే గాక.. పాఠకలోకానికి.. ముఖ్యంగా పద్యప్రియులకు ఓ గొప్ప అనుభూతిని పంచుతాయి..



శివునిగా నిరూపించడం కోసం దోరవేటి గారు ప్రతిపాదించిన అంశాలు సమర్థనీయంగానూ.. అభినందనీయంగానూ ఉన్నాయి.. అన్నదాత కష్టాలను... కన్నీళ్లను.. బాధలను.. మ్రింగలేక.. కక్కలేక.. కుత్తుకలో విషం గా అభివర్ణించి...పద్యకవిగా దోరవేటి గారు తమ కలానికి ఉన్న కవితాశక్తిని ప్రదర్శించడం ప్రశంసనీయం.

వివిధ శీర్షికలతో రాయబడిన ఇందలి పద్యాలు.. కవి మేధోసంపత్తికి.. లోక పరిశీలనకు పట్టం కట్టే విధంగా మలచబడినాయి.. కవితా వస్తువు ఎంపికలో.. అభివ్యక్తిలో.. ఆయన చూపిన శ్రద్ధ అభినందనీయం.. శిల్పం విషయంలో.. చతురతను ప్రదర్శించారు.

'నింగిని' వరుడిగా.. ధరణీ "సుమగాత్రి"ని వధువుగా మలచి నింగికి నేలకు తమ పద్యార్చన ద్వారా పెళ్ళి చేసిన ఘనత దోరవేటి గారికే దక్కుతుంది.. భూమి,ఆకాశాలకు పెళ్ళి చేసే.. సుందర ఘట్టాన్ని "నింగికి నేలకు పెళ్ళి" శీర్షికతో రాసిన పద్యాల్లో రమణీయం గా దృశ్యమానం చేశారు.. మేఘాలు నింగి నేలకు స్నానమాడించే కన్యకలుగా.. తలచి బ్రహ్మయే సాక్షాత్తుగా వచ్చి ఆ జంటకు బ్రహ్మముడి వేసే పురోహిత బ్రహ్మగా అభివర్ణించడం బాగుంది... అంతేగాక కవి యొక్క కలం బలాన్ని సూచించేలా ఉంది.

ఆహారము, ఆలోచన
వ్యాహారములోన ముద్ర వర్ధిల జేయన్
ధీ హృదయశక్తి నింపును
సౌహార్దము పెంపు సేయ సాత్విక భుక్తే !

అంటూ సాత్వికాహారం వల్ల ఒనగూరే ప్రయోజనాలను ఓ పద్యం ద్వారా 'సాత్వికాహారం' శీర్షికతో వివరించారు.

'ఏడువారాలు' శీర్షికతో రాసిన పద్యాలు బాగున్నాయి.

ఆదివారం కవులకు, కవితా ప్రియులకు ప్రియమైన రోజువ్వాలని.. సోమవారం శంకరుడు ద్వారా సకల శుభాలు పొందాలనీ.. మంగళవారం మంగళప్రదం కావాలనీ.. బుధవారం సకల శుభాలనొందాలనీ.. గురువారం నాడు సద్గురువుల శుభాశీస్సులందు కోవాలనీ.. శుక్రవారం నాడు స్వస్థత చేకూరాలనీ.. శనివారం సమస్త సౌఖ్యము లందించాలని కాంక్షిస్తూ దోరవేటి గారు పద్యారాధన చేశారు.

'ముగ్ధసౌందర్య వీణ' శీర్షికతో రాసిన పద్యాల్లో నా తెలంగాణ భవ్య సౌందర్య వీణ అంటూ రాసిన పద్యం అందరినీ ఆకట్టుకునే విధంగా తీర్చిదిద్దబడింది.

"రాజ రాజన్యులేలిన రమ్యభూమి
కవులు గాయకుల్ సత్కళాకారులమరి
భిన్న భాషలు, సంస్కృతులున్న భూమి"

అంటూ తెలంగాణ వైభవాన్ని చాటి చెప్పారు.

'మాతృభాషామృతం' శీర్షికతో రాసిన పద్యాల్లో మాతృభాషా ప్రాశస్త్యాన్ని ఆవిష్కరించారు.

'ఏవరి భాష వారికెంతో ప్రియంబైన
తెలుగుభాష ఘనత తెలుసుకొనియు
శ్రేష్ఠతములు పలికిరెంతో ఘనమ్మని
దేశ దేశములను తెలుగు లెస్స"

అంటూ తెలుగు భాషాభిమానాన్ని చాటుకున్నారు.

'స్ఫూర్తిదాతలు' శీర్షికతో రాసిన పద్యాల్లో స్ఫూర్తి ప్రదాతలైన చాణక్య, రుద్రమ దేవి, రాణాప్రతాప్, శివాజీ, శ్రీకృష్ణదేవరాయలు, ఝాన్సీరాణి, స్వామి వివేకానంద, అల్లూరి సీతారామరాజు, సర్దార్ భగత్‌సింగ్, గాంధీజీ, సర్దార్ వల్లభాయ్ పటేల్‌లపై కవి దోరవేటి గారు తమ గౌరవాన్ని చాటుకుంటూ ఒక్కొక్కరి గుణగణాలను.. ఉత్తమ వ్యక్తిత్వాలను.. ప్రస్తావించి.. పాఠకులు ప్రేరణ స్ఫూర్తి పొందేలా పద్యాలను తీర్చిదిద్దారు.

'అతిథి' శీర్షికతో రాసిన పద్యాల్లో ఆనాడు అతిథులు వస్తే ఎంతో సంబరపడేవారనీ.. ఈనాడు అతిథులొస్తే ఎందుకొచ్చారా అని బెంగ పడుతున్నారని పేర్కొంటూ నడుస్తున్న చరిత్రకు అద్దం పట్టారు.

"అల్లుడొచ్చెనన్న నరకోడి కూరను
కొసరి కొసరి బెట్టుకొనుట యేది?
వచ్చినోడు యెందుకొచ్చెనో యను బెంగ
ప్రతి గృహస్థునింట ప్రబలె నేడు" అంటూ వాపోయారు.

వరసలు కలుపుతూ ఒకనాడు పల్లెల్లో ఆత్మీయ పలకరింపులు ఉండేవనీ.. ఈనాడు అవి కనుమరుగైనాయని కవి తమ ఆవేదనను వ్యక్తపరుస్తూ ఇలా రాశారు.

"మామా! బావా! బాబాయ్!
మా మమతల కోవెలవని మరిమరి యనుచున్
ప్రేమల నొలుకుచు కులికెడి
గ్రామానందంబు లిపుడు గనపడవేలా!?"

అంటూ ప్రశ్నించారు.

"పద్యారాధన" శీర్షికతో రాసిన పద్యాలు కవి దోరవేటి గారి కవితా పటిమను చాటే విధంగా కొలువుదీరాయి. ఛందోబద్ధ పద్యాల్లో చిన్ననాటి తరగతి గది జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు.

"అది తెలంగాణ సిగలోన నడవిమల్లె
మారుమూలన గల పల్లెటూరు, నందు
జడు.పి.హెచ్.ఎసు, నందులో బుడతలంత
రక్కసులె! యది జూడ నారవ తరగతి"

అంటూ ఆరో తరగతి చదివే కాలంనాటి బాల్యస్మృతులను ఛందోబద్ధ పద్యాల్లో బంధించి కవి దోరవేటి గారు అందరినీ మెప్పించారు.

పద్యాల్లో చిన్ననాటి ఘటనలను.. కథారూపం కొనసాగించిన తీరు బాగుంది.

"పద్యము జదివెడి వానికి
హృద్యముగా నొంటబట్టునే చదువయినన్
విద్య తల్లియె నీకన
పద్యముగా నన్ని నేర్పు బాలక! జయమౌ!"

అంటూ అందరు దీవించి వెళ్లిన సంఘటనను పద్యం ద్వారా చక్కగా తెలియజెప్పారు. చిన్నప్పుడు అందరు మిత్రుని ప్రతిభను మెచ్చుకున్నతీరును పద్యాల్లో ఆవిష్కరించారు. ఒకరోజు పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఆరోతరగతికి వచ్చి.. అందరికన్న పెద్దగొంతున్న చిన్నాను జూచి.. ఇలా అన్నట్లు.. రాసిన పద్యం నిజంగా కవి దోరవేటిగారి సృజనాత్మక ప్రతిభకు.. అద్దంపట్టేలా ఉత్పలమాలలో రూపుదిద్దుకుంది.

"లెక్కలు రావు; ఆంగ్లము సరేసరి; సైన్సులు
సున్న; సోషలిం
కెక్కడ యాస? పిల్లగ! మరేమివచ్చునురోరి
నీకు?" నం
చెక్కస మూడు మాష్టరుల హెడ్డును జూడగలేక
శీర్షమున్
చక్కగ నుంచలేక వినజాలగ లేకను సాటి
నవ్వులన్!

అంటూ రాసిన పద్యం అందరినీ ఇట్టే ఆకట్టుకుంటుంది.

"మా ఊరు" శీర్షికతో రాసిన పద్యాల్లో వరసలు గలిపి ప్రేమతో పలకరించే పల్లె ప్రజల ఆత్మీయతానురాగాలను ఆవిష్కరించారు. ఈరోజు అవన్నీ కరువై.. ఎవరికి వారే యమునాతీరే చందంలా యాంత్రిక జీవనంతో పల్లెలు కొనసాగుతున్నాయని కవి తమ బాధను వ్యక్తపరిచారు.

"ఊరపిచ్చుకలే లేవు; పోరగాళ్ళ
పీకులాటలు లేవు; సంప్రీతి గూర్చు
జానపద కళలెక్కడో; రోజు రోజు
పల్లె 'పైన పటార' పగిదియయ్యె!"

అంటూ నేటి పల్లెల తీరుతెన్నులను అక్షరాల్లో ఆవిష్కృతం చేశారు.

కరోనాభయంతో నగరాలు వదిలి, వందల మైళ్ళు నడిచి, పల్లెలకు చేరుకొంటున్న సందర్భంలో ఎదురుచూసిన ఒక ముసలితల్లి మనోవ్యథను తెలుపుతూ తెలంగాణ యాసలో "ఒకతల్లి గోస" శీర్షికతో పద్యాలనల్లిన తీరు చాలా బాగుంది. కవి దోరవేటి గారి ప్రతిభను చాటే విధంగా తీర్చిదిద్దబడ్డాయి. తెలంగాణ పద బంధాలు.. కడుపు తిప్పలు.. సోకము, యెతగతి, గుంత, జెర్రంత, సాళెలు, పోళెలు, పొలగాళ్ళు, గోళీలు.. గత్తర, అరుసు కొను, ఇటెంకలు, కరుసు మొదలగు పదాలను ఆయా పద్యాల్లో ఔచిత్యవంతంగా ప్రయోగించేయడం లో కవి దోరవేటి గారు సఫలీకృతులైనారు.

"వ్యంచ పద్యహారతి" శీర్షికతో రాసిన పద్యాల ద్వారా సినారె కవితా వైభవాన్ని.. సినారె వ్యక్తిత్వాన్ని, మూర్తిమత్వాన్ని.. సినారె రచనా వైచిత్రిని.. అందంగా ఆవిష్కరించారు.

భాషలెన్నియో పుక్కిట బట్టినాడు
ఉద్యమాలన్నిటికిని ముందుండినాడు
శిష్యకోటిని మించు ప్రశిష్యకోటి
పూజలందుకొను సినారె పుణ్యయశుడు!

అంటూ సినారె పట్ల కవి తమ గౌరవాన్ని చాటుకున్నారు.

"భజన" శీర్షికతో రాసిన పద్యాల్లో నవవిధ భక్తిమార్గాలను.. భగవదారాధన ఎలా చేయాలో వివరించారు.

"వార్ధక్య చింతన" శీర్షికతో రాసిన పద్యాలు ఆర్ద్రంగా మలచబడ్డాయి.

"దారిదీపం" శీర్షికతో రాసిన పద్యాల్లో ఉపాధ్యాయుణ్ణి దారిదీపంగా ఆవిష్కరించిన తీరు బాగుంది.

ఇలా కవి దోరవేటి గారు "పద్యారాధన" ఖండకావ్య సంపుటిలో అనేక సామాజికాంశాలను.. సాంప్రదాయబద్ధ విషయాలను స్ఫూర్తిప్రదాతలను ఛందోబద్ధ పద్యాల్లో అందంగా ఆవిష్కరించి అందరినీ అలరించే ప్రయత్నం చేయడం ప్రశంసనీయం..దోరవేటి గారు ఇందులో పొందుపరిచిన పద్యాలు ధారణకు యోగ్యంగా.. ఉండే విధంగా గణ యతి ప్రాసలనే కట్టుబాట్లతో ముస్తాబై వచ్చాయి. లయబద్ధంగా.. నిబద్ధతతో రూపుదిద్దడంలో ప్రదర్శించిన కవి యొక్క ప్రతిభాపాటవాలను అభినందించకుండా ఉండలేము.. ఈ పద్యాలు సమాజ హితానికి బాటలు వేస్తాయి.పఠితులకు కర్తవ్యోన్ముఖులను చేస్తాయి.. ఈ పద్యాల్లో దోరవేటిగారి ఊహాశక్తి, పద్యరచనా యుక్తి..సామాజిక చింతనం.. ఆయన ఉత్తమ సంస్కారం ..వ్యక్తిత్వం అడుగడుగునా మనకు కానవస్తాయి. వివిధ శీర్షికలతో హృద్యంగా మలచబడిన పద్యాలు పద్యప్రియులకే కాక ప్రతిఒక్కరూ చదువదగినవిగా తీర్చిదిద్దబడినాయి. ఈ ఖండ కావ్య సంపుటిని కీర్తిశేషులు డాక్టర్ అంకెం శివజ్యోతి గారికి అంకితమివ్వడం అన్నివిధాల సమర్థనీయంగా ఉంది...ఈ కావ్యం వెలుగులోకి రావడానికి సహకరించిన శ్రీ చింతామణి జానకి రామారావు గారికి... ప్రచురణ బాధ్యతలను స్వీకరించిన సాహితీ కళాభారతి షాద్‌నగర్ ప్రతినిధులకు అభినందనలు తెలుపుదాం... పద్య ప్రక్రియకు పట్టాభిషేకం చేసిన కవి దోరవేటి గారికి శుభాకాంక్షలు తెలియజేద్దాం.. ముస్తుందు మరిన్ని సమాజ హిత రచనలు ఆయన కలం నుండి జాలువారాలని కోరుకుందాం...

ప్రతులకు: దొరవేటి
సెల్:9866251679

–దాస్యం సేనాధిపతి
9440525544

మంగళవారం ప్రముఖ సాహితీవేత్త శ్రీ గుర్రం జాషువా జయంతి సందర్భంగా చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న అతిథులు బొగ్గారపు దయానంద్, కళా వి.ఎస్. జనార్దనమూర్తి, రమణ వెలమకన్న, తుమ్మలపల్లి సత్యనారాయణ, పి.యస్.ఆర్. మూర్తి, అంబాలమురళిధర్.

ద్వేషం పనికిరాదు (కథ)

శరభయ్య దానగుణం గల మనిషి. ఆయనకు పిసినారులు అంటే మహా కోపం .తన మిత్రులందరిలో శరభయ్యకు భూషయ్య అంటే చాలా కోపం. ఎందుకంటే భూషయ్య పిసినారని అతడు పసిగట్టాడు.

ఒకసారి శరభయ్య మామిడి తోటలో వనభోజనానికి తన మిత్రులను అందరినీ ఆహ్వానించాడు. భూషయ్య ఆరోజు ఊరిలో లేడు కనుక అతన్ని ఆహ్వానించలేదు. శరభయ్యకు అతడు వనభోజనానికి రావాలని కూడా లేదు. అందువల్ల అతడు లేనందుకు శరభయ్య ఎంతో సంతోషించాడు .తన మామిడి తోటలోని మామిడి పళ్ళు తోటమాలి చేత తెంపించి మిత్రులకు తల కొన్ని పళ్ళు ఇవ్వాలని శరభయ్య ఆలోచన. అలా కొన్ని మామిడిపళ్ళు తెంపించి వారి ముందు పెట్టాడు.

అప్పుడే భూషయ్య పిలవని పేరంటంగా ఎక్కడి నుంచో ఊడిపడ్డాడు. అతడు వచ్చీ రాగానే ఆ పళ్ళలో నుండి రెండు పండ్లు చేతబట్టి "శరభయ్యా! నేను ఊరిలో లేకపోవడం చూసి ఈ భోజనం పెట్టావేంటయ్యా! అయినా నీవు నన్ను పిలవకుండా నేనే తెలుసుకొని వచ్చాను లే" అంటూ చేతిలో ఉన్న మామిడి పండ్లను తినసాగాడు. శరభయ్యకు అరికాలి మంట నెత్తికెక్కింది. అయినా తమాయించుకున్నాడు. ఆ తర్వాత అందరూ ఒక్క మామిడి పండ్ల బుట్ట తీసుకెళ్తే భూషయ్య రెండు బుట్టల మామిడి పండ్లను తీసుకొని వెళ్ళాడు. కానీ శరభయ్య పైకి ఏమీ మాట్లాడలేదు.

మరునాడు శరభయ్య తన కొడుకుతో ఆ భూషయ్య పిసినారి తనం గురించి చెప్పాడు. అప్పుడు అతని కొడుకు సాంబు "నాన్నా! నీవు అనుకున్నది నిజం కాదు. ఆ భూషయ్య మామ గొప్పదాత . అతడు అనవసరమైన వాటికి నయాపైస కూడా ఖర్చు పెట్టడు. మేము వేసవిలో బాటసారుల దాహార్తి తీరుద్దామని అతని వద్దకు వెళితే ఆ ఖర్చంతా కూడా తానే భరించాడు. అంతే కాకుండా పేద కళాకారులకు సాయం చేద్దామంటే అతడే ముందుకు వచ్చాడు తప్ప మీ మిత్రులలో ఆఖరికి మీరు కూడా ముందుకు రాలేదు. ఆ డబ్బంతా ఆయనే ఇచ్చారు. మరొక సంగతి. పైకి ఆయన పిసినారిలా కనిపిస్తాడు కానీ ఆయనలో దానగుణం ఎక్కువ. ఆయన మన తోటమాలికి కూడా డబ్బు ఇచ్చాడు .అతడు మన పండ్లు ఉచితంగా తీసుకొని వెళ్ళాడని మీరు అనుకున్నారు. అది మీ తప్పు. అతడు మన తోటమాలికి ఇచ్చిన డబ్బు ఐదు బుట్టల మామిడిపళ్ళతో సమానం. మీరు అనవసరంగా ఆయనపై ద్వేషాన్ని పెంచుకున్నారు" అని అన్నాడు . అతడి మాటలకు శరభయ్య తన ప్రవర్తనకు సిగ్గుపడ్డాడు.

–సంగనభట్ల చిన్న రామ కిష్టయ్య
9908554535.

చరిత్రలో నేటినిజం

తం॥ త్రినేతుమంభారిదమునకై
మనుపుము మానసమునందు మదిగాలిపుచున్
ఘనమగు 'బ్రజేశు యుక్తి'
చదువుగ చికకొత్తు సంతె చరితపుటలలోన్ ॥

(సెప్టెంబర్ 29 రక్షణ రంగ నిపుణుడు
బ్రజేష్ చంద్రమిశ్రి జననం...)

–రాధశ్రీ
సెల్:9494481210

ఈ కావ్యంలో కవి దోరవేటి గారు అన్నదాత వ్యథలకు అద్దంపడుతూ.. అన్నదాతల గొప్పదనానికి అక్షర హారతి నిస్తూ.. **"సైరికా నమో"** శీర్షికతో రాసిన పద్యాలు హృద్యం గా ఉన్నాయి.. **"హాలము మహో యుధమ్ము, ఫణిహారము తుండు"** అంటూ భోలా శంకరునితో పోల్చడం ఔచిత్యవంతంగా ఉంది. రైతును

సాహితీ కెరటాలు

E-mail : netinijam93@gmail.com

website: www.netinijam.com

2 హైదరాబాద్ ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 గురువారం 29-9-2022

నానీలు

చీమల బారుల్లో
ఎంత సంస్కారం
మనుషుల వరుసల్లో
జాతి వికారం.

మట్టి మాట్లాడితే
పచ్చని పొలం
చెట్టు పాడితే
విచ్చిన ఫలం

కన్పించని కోయిల
స్వర జీవనమై
మనసు నిండింది
మధుర భావనమై

నోట్లు కాటేస్తున్నాయి
చెట్లును
అందుకే
కాలుష్యాన్ని వీస్తున్నాయి

-డా॥ శిరీష
సెల్:98660 50220

సంగీరావం

ఓదార్చేవాళ్లు లేరని
వేదనపడితే ఎలా?
చిత్తాన్ని సాంత్వనర్చేది
నేత్రాల మత్తడేకదా.

పిల్లల పెంపకాలను
గాలికి వదిలేస్తే ఎలా?
పరుల ప్రాణాలను
గాలిలో కలిపేస్తారు కదా.

విశ్వాసం
విశ్వాన్ని స్పర్శిస్తుంది
అవిశ్వాసం
అధఃపాతాళాన్ని దర్శిస్తుంది.

-గంటా మనోహర్‌రెడ్డి
సెల్:9949992964

ఘనంగా జరిగిన జి.వి.ఆర్. 'అంతరంగపు భాష' కవితా సంపుటి పరిచయ సభ

"అంతరంగపు భాష" కవితా సంపుటి రచయిత డా॥జెల్ది విద్యాధరరావును సత్కరిస్తున్న అతిథులు.

ప్రముఖ సాహితీ సంస్థ సాహితీ కౌముది, ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం మోతీనగర్ రాయల్ గార్డెన్ ఫంక్షన్ హాల్లో జరిగిన జెల్ది విద్యాధర్ రావు రచించిన "అంతరంగపు భాష" కవితా సంపుటి పరిచయ సభ ఘనంగా జరిగింది.

ముఖ్య అతిథిగా హాజరైన కేంద్ర సాహిత్య అకాడెమీ తెలుగు సలహా మండలి అధ్యక్షులు, ప్రఖ్యాత కవి కె శివారెడ్డి మాట్లాడుతూ విద్యాధర్ కవిత్వంలో మానవ జీవన సంఘర్షణలు, మానవ సంబంధాలు అద్భుతంగా ఆవిష్కరించారని తెలియజేసారు. కవితలలో కొన్ని ముఖ్యమైన పాదాలను ఉదహరించి కవి అంతరంగాన్ని తెలియచేసి ఆహూతులను అలరించారు. పేదప్రజల సానుభూతి పరుడైన విద్యాధర్ వ్యక్తిత్వాన్ని ఆయన కవిత్వం ప్రతిబింబిస్తుంది, ప్రతిఫలిస్తుందని ప్రసంగంలో పేర్కొన్నారు.

అనంత పద్మనాభ రావు సభా ప్రారంభంతో మొదలైన ఈ సభలో సభాధ్యక్షులు, ప్రముఖ కవి, విమర్శకులు రమణ వెలమకన్ని అధ్యక్ష ఉపన్యాసంలో కవులపై కవిత్వంపై కవికున్న అపారమైన ప్రేమను వివరించి అత్తరు సాయుబు అభిమాని అనే కవితలోనివి, మరికొన్ని కవితలలోని పాదాలు ఈ సందర్భంగా ఉటంకించారు.

పుస్తక పరిచయం చేసిన ప్రముఖ కవి, సినీగేయ రచయిత మౌనశ్రీ మల్లిక్ కవితా సంపుటిలోని విభిన్న కవితలనూ ముఖ్యంగా, గొంగళి పురుగు, కొత్త ప్రశ్నలు, నీవు మిగిలివున్నట్టే, గులాబీ రెప్పలు, ఎలుకల్లారా ఏకంకండి కవితల్లోని భిన్నఅంశాలను ప్రస్తావించి, కొన్నింటిని గేయరూపంలో శ్రావ్యంగా ఆలపించి సభికులను మంత్ర ముగ్ధులను గావించారు.

ఈ సభలో విశిష్ట అతిథి, నేటినిజం సంపాదకులు బైసా దేవదాస్ మాట్లాడుతూ విద్యాధర్ కవిత్వం నిండా సమ సమాజంపై, స్త్రీలపై తన కున్న అపారమైన గౌరవాన్ని, ప్రేమను ప్రస్ఫుటపరచారని ప్రస్తుతిం చారు. గూడూరి ఫౌండేషన్ చైర్మన్ గూడూరి చెన్నారెడ్డి,గూడూరి విజయ లక్ష్మి, బండికల్లు శ్యాంప్రసాద్, సుప్రసిద్ధ కవులు పెద్దూరి వెంకటదాసు ఆచార్య శిఖామణి, ప్రొఫెసర్ గల్లా వెంకట రత్నాకర్ తదితరులు పాల్గొన్నారు.

'అంతరంగపు భాష' కవితా సంపుటి పరిచయ సభలో గూడూరు విజయలక్ష్మి, పెద్దూరి వెంకటదాసు, మౌనశ్రీ మల్లిక్, గూడురు చెన్నారెడ్డి, బైస దేవదాసు, రమణ వెలమకన్ని, కె.శివారెడ్డి, డా॥జెల్ది విద్యాధరరావు,అనంత పద్మనాభరావు, బండికల్లు శ్యాంప్రసాద్, శిఖామణి.

కవి సమ్మేళనంలో పాల్గొన్న కవులు, కవయిత్రులతో అతిథులు.

సభా కార్యక్రమానికి ముందు కొమ్మవరపు విల్సన్ రావు ఆధ్వర్యంలో జరిగిన కవి సమ్మేళనంలో కవులు, కవయిత్రులు వంజారి రోహిణి, మంజులా సూర్య , మధుసూదన శర్మ, కామేశ్వర రావు, నల్లా భాగ్యలక్ష్మి, కుమారి వాడపల్లి తులసి, జి.వి.మల్లిక, పుష్పమీ సాగర్, డా॥ చెమన్ శ్రీనివాస్ గౌడ్, రవీంద్ర సూరి నామాల సూరి, పత్తిపాక ఉత్పల రాధాకృష్ణ మొదలగు అనేక మంది సాహితీవేత్తలు పాల్గొన్నారు.

గూడూరు విజయలక్ష్మి అతిథులకు, ఆహ్వానించగా, పెద్దూరి వెంకట దాసు వందన సమర్పణ చేశారు.

సభకు ముందు చిరంజీవి గూడూరి వన్‌రాజ్‌రెడ్డి నృత్య ప్రదర్శన అందరినీ ఆకట్టుకుంది.



సెల్: 9440622781

ఎయిర్ పోర్ట్‌లో
ఏపుగా చెట్లు
ఎందరి వీడ్కోళ్ళ
కన్నీళ్లు ప్రవహించాయో!

ప్రేమిస్తే ప్రాణమిచ్చే
నాటి ప్రేమికుడు-
కాదంటే ప్రాణం తీసే
నేటి లవర్!!



పొలాలనన్నీ
దున్నమని శ్రీశ్రీ
పొలాలనమ్మి ఇళ్ళు
కట్టమని మేస్త్రీ!!

సమైక్యత లేకపోతే దేశం అల్లకల్లోలం

- తెలంగాణ సాహిత్య అకాడమీ చైర్మన్ జూలూరు గౌరీశంకర్

జాతీయ సమైక్యతను నిలుపుకోలేకపోతే దేశం అల్లకల్లోలమవుతుందని దేశంలో అభివృద్ధి ఆగిపోతుందని తెలంగాణ సాహిత్య అకాడమీ చైర్మన్ జూలూరు గౌరీశంకర్ అన్నారు. ప్రగతిశీల శక్తులు, అభ్యుదయవాదులు, సామాజికంగా ఆలోచించే కవులు, రచయితలు జాతీయ సమైక్యత, మత సామరస్యంపై విరివిగా రచనలు చేయాలన్నారు.

ఆదివారం పీవీ నరసింహారావు వెటర్నరీ యూనివర్సిటీ ఆడిటోరియంలో జాతీయస్థాయిలో జరిగిన తెలంగాణ పొయెట్రీ ఫెస్టివల్‌ను ఆయన ప్రారంభించారు.

తెలంగాణ పోయెట్రీ ఫెస్టివల్‌లో పుస్తకాలు ఆవిష్కరిస్తున్న జూలూరు గౌరీశంకర్ తదితరులు.

ఈ సందర్భంగా మాట్లాడుతూ మతాన్ని నమ్ముకున్న రాజ్యాలు ఏ రకమైన దుస్థితిని ఎదుర్కొంటున్నాయో ఈ తరానికి రచనల ద్వారా తెలియజేయాలన్నారు. జాతీయస్థాయిలో కవి సమ్మేళనాన్ని ఏర్పాటు చేయడంతో పాటుగా స్థానికం గా యువతకు స్ఫూర్తిని కలిగించే విధంగా రచనలు విస్తృతంగా రావాలన్నారు. తెలంగాణ పొయెట్రీ ఫెస్టివల్‌లో ఉత్తరప్రదేశ్, అసోం, పశ్చిమ బెంగాల్, ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రాలకు చెందిన కవులు పాల్గొన్నారు.

తెలంగాణలోని కవులు డాక్టర్ దామెర రాములు, డాక్టర్ అప్పాల చక్రధారి, సుంకర రమేష్, కొండి మల్లారెడ్డి, అన్నవరం దేవేందర్, తుమ్మల దేవ రావు,అంబటి నారాయణ, శ్రీ రామకవ చం సాగర్‌లు హాజరయ్యారు.

ఈనెల 25న రవీంద్రభారతిలోని పైడి జయరాజు ప్రివ్యూ థియేటర్‌లో ప్రముఖ కవి డా॥ నాళేశ్వరం శంకరంతో జరిగిన ముఖాముఖి కార్యక్రమంలో డా॥ నాళేశ్వరం శంకరంను సన్మానిస్తున్న మెర్సిమార్గరెట్, శీలా సుభద్రాదేవి, మాధభూషి లలితాదేవి. కందుకూరి శ్రీరాములు, రాపోలుసుదర్శన్, డా॥ మామిడి హరికృష్ణ, పొన్నం రవిచంద్ర, యాదయ్య, అయోధ్యారెడ్డి, దప్పోల్ల రమేశ్.

అవని హద్దులు చెరపివేసే "అనువాద ప్రక్రియ"

'రచన కత్తి మీద సామైతే, అనువాదం రెండు కత్తుల మీద సాములాంటిది' అంటారు. భాష తెలిసిన ప్రతి వారూ రచయిత కాలేరు , రెండు భాషలు తెలిసిన ప్రతివారూ అనువాదకుడు కాలేడు. ఒకరి భాష మరొకరికి తెలియని ఇరువురి మధ్య సంభాషణలు చర్చలు సాగాలంటే రెండు భాషల్లో ప్రవేశమున్న వ్యక్తి కావాలి. వాటిని పుస్తకీకరించడం 'అనువాదం ' అంటారు. ' భాషాంతరీకరణం' 'తర్జుమా ', ఆంగ్లంలో 'ట్రాన్సులేషన్ '. (Translation)అంటారు. సంస్కృతం లో అనువాదమంటే అర్థం 'పునఃకథనం". అనువాద ప్రక్రియ చాలా పురాతనమైనది. ఈ చరిత్రను కొంత పరిశీలిద్దాం. క్రీస్తు .పూ. 3వ శతాబ్దంలో మెట్టమొదటి అనువాదం హెబ్రోన్ నుండి గ్రీకు భాష లోనికి "బైబిల్ ' అనువదించబడింది. అనువాద చరిత్ర కాలాన్ని 'జార్జ్ స్టేయినర్ ' (george Steiner) వంటి మహాశయులు నాల్గు విభాగాలుగా వివరించారు. మొదటిది రోమన్ అనువాదకుడు సిసిరో ' (Cicero) మరియు 'అలెగ్జాండర్ ఫ్రేజర్ టైట్లర్ ' (alexander froser tytler)తో ప్రారంభమైంది. రెండవ భాగం 'వాలేరి 'తో మొదలైంది.మూడవ భాగం Valery' నుండి 1960 సం. వరకూ, నాల్గవ విభాగం 1960 నుండి మొదలయింది. అనువాద చరిత్ర క్రీ. పూ. 3000 సం. నుండి ప్రారంభమైందని విజ్ఞులు చెబుతారు. మొదటి అత్యంత పురాతన అనువాద ప్రక్రియ 'Rosetta stone' క్రీ.పూ. 2వ శతాబ్దంలో ఆరంభమైందని ప్రకటించబడినది.' అలెగ్జాండర్ ఫ్రోజర్ టైట్లర్' అనే విమర్శకుడు, స్కాటిష్ న్యాయవాది, గ్రీక్ మరియు రోమన్ పురాతన వస్తు ప్రొఫెసర్ (1741-1813) 1791లో "essay on principles of translation" అనే గ్రంథాన్ని రచించాడు. అది అనువాద సిధ్ధాంత చరిత్రలోనే ముఖ్యమైనది. ప్రసిద్ధ అనువాదకుని విశ్వసనీయత, స్వచ్ఛత, మరియు గంభీరత " టైట్లర్" నుండి వచ్చిందని "గాన్ కెచావో" 1975లో రాసిన పుస్తకం లో వాదించారు. అనువాదం సంపూర్ణమైన ఆలోచన , అసలైన శైలిని సూచిస్తుందని మరియు అసలు కూర్పు యొక్క సౌలభ్యాన్ని కలిగి వుంటాయని "టైట్లర్" వ్యాఖ్యానించాడు. " It will serve to demonstrate that the art of translation is of more dignity and importance than has generally been imaged' అని వక్కాణించారు. ప్రపంచ అత్యున్నత అనువాదకుడు క్రీ.శ. 5వ శతాబ్దానికి చెందిన బౌద్ధ సన్యాసి' కుమార జీవుడు' అనే మహాయాన పండితుడు. ఇతని అనువాదాలలో ' diamond suthra' అనునది సుప్రసిద్ధమైనది. భారతీయ సంస్కృతము నుండి చైనా భాషలోకి అనేక బౌద్ధగ్రంథాలను అనువదించాడు. చైనా అనువాదములనుండి ఇంగ్లీషు భాషతో పాటు అనేక ఇతర ప్రపంచ భాషల్లోకి ప్రామాణిక బౌద్ధ గ్రంథాలు అనువదింపబడ్డాయి.. మొదటి అనువాదములు 'మెసపటోనియా ' కాలంలో (సుమేరియన్ పోయమ్) ఆసియన్ భాషలోకి వచ్చినవి. తరువాత ఇతర పురాతన అనువాదములు బౌద్ధ సన్యాసుల ద్వారా భారతీయ భాషలనుండి చైనా భాషలోకి అనువదించ బడినవి. సంస్కృతంలో తొలి ఇతిహాసం ' వాల్మీకి రామాయణం' . వ్యాసుని భారతం కూడా ఇతిహాసమే. ఇతిహాసం సంస్కృతం లో పురాతన ప్రక్రియ. గ్రీకు సాహిత్యంలో ' ఎపిక్' ప్రక్రియ కూడా ఇతిహాసం లాంటిదే. తెలుగు భాషలో మొదట వెలువడింది మహాభారతమే. తరువాత 'రామాయణం.' కాబట్టి నన్నయ అనువదించిన భారతమే తొలి ఇతిహాసంగా పరిగణించారు. అది కావ్యం గా మలచిన ఘనత నన్నయ దే. అందుకే మహాభారతము ను 'కావ్యేతిహాసం 'అని అంటారు. సంస్కృతం నుండి తెలుగు అనువాదాలలో నన్నయ వాల్మీకి, వ్యాసాదులననుసరించినది యథా తథానువాదం కాదు. వారు అనుసరించినది 'కథానుసార పద్ధతి.' అనువాద

అనువాదం ఒక కళ. అది అందంగా వుండాలంటే మూలానికి ప్రాతినిధ్యం ఇచ్చినా కొంత 'క్రియేటివిటీ ' అవసరం. కేవలము మూలాన్ని అనుసరిస్తే అది అందంగా వుండకపోవచ్చు.

ప్రక్రియ సృజనాత్మక మైన కళగాగాని, కళా నిపుణతగా గాని తీసుకుంటేనే సహేతుకంగా వుంటుంది. ముఖ్యంగా అనువాదంలో మూలభాషే మూలాధారం . మూల రచయిత శైలిని, సృజనావిధానాన్ని ,అనుభూతులను అనువాదకుడు ప్రస్ఫుట పరచగలగాలి. మూలభాషే మాతృభాషయితే అందులోని భావం స్పష్టమై ఉత్తమ స్ఫూర్తిని కలిగిస్తుంది. అలాగే లక్ష్యభాషే మాతృభాష అయిన వారికి అందులోని సారాంశం స్పష్టమై భవిష్యత్ కాలంలో అదే గొప్ప అనువాద గ్రంథమౌతుంది. అనువాదకునికి మూలభాష ,లక్ష్యభాషలందు నైపుణ్యం వుంటేనే చాలదు. రెండుభాషలలోని సంస్కృతి, సంప్రదాయ విధానాలే కాక వారి నడికారాన్ని తద్వారా వారి జీవన శైలిని, ఆ భాష వాక్య నిర్మాణాన్ని అవగాహన చేసుకొన్నప్పుడే అది మంచి అనువాదం అవుతుంది. మూలగ్రంథం లోని విషయం మీద ఆసక్తి , అధ్యయనమే గాక మూలకవి యొక్క భావదృక్పదం మీద కూడా దృష్టినుంచి తాను అనువాదం చేస్తున్న గ్రంథం యొక్క భావ స్థాయిని, శబ్ద మూలాలను పట్టుకోవాలి. అనువాద కళ గురించి ఎందరో ఉత్తమ రచనలు చేశారు . వారిలో ముఖ్యులు అలెగ్జాండర్ టైట్లర్, రెనెటో సోగియోలీ. . ఇక తెలుగు భాష లో అనువాద చర్చకు వస్తే ప్రముఖ విమర్శకులు, కవి రాచమల్లు రామచంద్రారెడ్డి (రా.రా) రచించిన ' ఆనువాద సమస్యలు' అనే విమర్శనా గ్రంథం ప్రసిధ్ధమైనది. అందులో ఇంగ్లీషు నుండి తెలుగు లోకి అనువదించే సందర్భంలో ఎదుర్కొనే సమస్యలను వివరిస్తూ తెలుగు భాషా ప్రముఖులు చేసిన పొరపాట్లు కూడా తెలుపుతూ నాలుగు విధాల దోషాలను 54 ఉదాహరణము గా విభజించి వివరించాడు. ఈ గ్రంథం కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు పొందింది. వాస్తవానికి తెలుగు సాహిత్యం తొలిదశ అనువాదములతోనే ప్రారంభమైంది. అత్యంత పురాతనమైన సంస్కృతం, గ్రీకు, లాటిన్ సాహిత్యాల వంటివి తప్ప ఇతర ప్రపంచ భాషా సాహిత్యాలన్నీ అనువాదాలతోనే ఆరంభమైనవి. అనువాదం ఒక కళ. అది అందంగా వుండాలంటే మూలానికి ప్రాతినిధ్యం ఇచ్చినా కొంత 'క్రియేటివిటీ ' అవసరం. కేవలము మూలాన్ని అనుసరిస్తే అది అందంగా వుండకపోవచ్చు. ఉదాహరణకు భర్తృహరికి ఎన్నో అనువాదాలు వచ్చినా ఏనుగు లక్ష్మణకవే ఎందుకు అందరినీ దాటి వెళ్ళాడంటే చందస్సు ఎన్నికలో సజీవభాషను అందించినందుకే. మూలకవి యొక్క అంతరాత్మను సరిగా ఆవిష్కరించలేక పోయినందువల్లనే గొప్ప గొప్ప గ్రంథాలు లక్ష్యభాషలో రాణించలేక పోయినవి. ఉదహరించడానికి విశ్వకవి రవీంద్రుల ' గీతాంజలి' ని పేర్కొనవచ్చును. మహాభారతాన్ని ఎందరు అనువదించినా కవిత్రయానువాదమే అద్వితీయమైనది.అట్లాగే పోతన భాగవత అనువాదం కూడా నేటికీ తెలుగువారి హృదయ సామ్రాజ్యాన్ని ఏలుతూనే వున్నది. ఏది ఏమైనా అనువాద ప్రక్రియకు విదేశాలలో వున్నంత ప్రాచు ర్యం మనకు లేదని చెప్పక తప్పదు. భారతీయ భాషల్లోనే అనేక గ్రంథాలు ఆంగ్లభాషలోకి అనువదింపబడి విశ్వఖ్యాతినార్జించినవి. ఇటీవలి కాలంలోనే 'గీతాంజలి శ్రీ' అనే హిందీ నవలా రచయిత్రి రాసిన 'రేత్ సమాధి' నవల ఇంగ్లీషులో ' టోంబ్ ఆఫ్ శాండ్' గా అనువదింపబడి అంతర్జాతీయ ప్రసిద్ధమైన 'బుకర్' ప్రైజ్ ను పొందిన తొలి బారతీయ భాషా నవల..ప్రపంచ హద్దులను

తుడిచివేసే అనువాద ప్రక్రియ సాహిత్యలోకంలోనే కాక అంతర్జాతీయ సోదరత్వాన్ని, సంఘీభావాన్నీ కలిగిస్తుందనడంలో సందేహం లేదు. మూల, లక్ష్య భాషలలో ఏ ఒక్క భాషలో కూడా ప్రావీణ్యత సాధించనివారు ఈ ప్రక్రియలోనికి ప్రవేశించడం వలన అనువాద ప్రమాణాలు దిగజారటమే గాక ,అసలు లేకుండా పోతున్నాయని పండితులు చెప్పడంలో నిజం లేకపోలేదు. ఈ అనువాద క్రియను పటిష్టపరచి అంతర్జాతీయస్థాయికి పెంచవలసిన బాధ్యత భాషావేత్తలపై ఎంతైనా వుంది.

(సెప్టెంబర్ 30 అంతర్జాతీయ అనువాద దినోత్సవ సందర్భంగా)

- మాయకుంట్ల నారాయణరెడ్డి
9989686603

'తానా' బహుమతి నవలలు 'మున్నీటి గీతలు', 'అర్ధనారి' ఆవిష్కరణ

తానా నిర్వహించిన నవలల పోటీలు తెలుగు సాహిత్యంలో నవలా వికాసానికి దోహదం చేస్తాయని కవి, తెలంగాణ సాహిత్య అకాడమీ మాజీ అధ్యక్షుడు డాక్టర్ నందిని సిధారెడ్డి అన్నారు. 'తానా' నవలల పోటీలో చింతకింది శ్రీనివాసరావు రచించిన **'మున్నీటి గీతలు'** బండి నారాయణ స్వామి రాసిన **'అర్ధనారి'** బహుమతి పొందాయి. వీటి ఆవిష్కరణ మహోత్సవం సోమవారం రాత్రి హైదరాబాద్‌లోని పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయంలోని ఎన్టీఆర్ కళామందిరంలో నిర్వహించారు. కవి. కె.శివారెడ్డి, అధ్యక్షతన జరిగిన సభలో నందిని సిధారెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని నవలా రచయితలకు బహుమతులు అందజేశారు. అనంతరం మాట్లాడుతూ తానా నవలల పోటీ తెలుగు సాహిత్యానికి గొప్ప సేవ చేస్తోందన్నారు. 'మున్నీటి గీతలు' ఆవిష్కరించిన సినీ దర్శకుడు క్రిష్ మాట్లాడుతూ.. తెలుగు సాహిత్యంలో అద్భుతమైన నవలలు వస్తున్నాయన్నారు. సుప్రసిద్ధ రచయిత వీరభద్రప్ప 'అర్ధనారి' నవలను ఆవిష్కరించారు. కథాసాహితీ సంపాదకులు వాసిరెడ్డి నవీన్ సమన్వయకర్తగా వ్యవహరించగా.. నవలా పోటీ న్యాయనిర్ణేతలు మదురాంతరం నరేంద్ర, మహ్మద్ ఖదీర్‌బాబులు నవలలను పరిచయం చేశారు.తానా కోశాధికారి కొట్టా అశోక్‌బాబు మాట్లాడారు. తానా నవలలపోటీ సమన్వయకర్త జంపాల చౌదరి, ప్రచురణ కమిటీ అధ్యక్షుడు కన్నెగంటి చంద్ర తదితరులున్నారు.

'మున్నీటి గీతలు' నవలల ఆవిష్కరణ కార్యక్రమంలో కె.ఎస్. మల్లీశ్వరి, బండి నారాయణస్వామి, కొల్లా అశోక్‌బాబు, చింతకింది శ్రీనివాసరావు, కె.శివారెడ్డి, క్రిష్, నందిని సిధారెడ్డి, వీరభద్రయ్య.

ఈనెల 25న రవీంద్రభారతిలో "సురవరం-మనవరం" (126 కవితల) కవితా సంకలనం ఆవిష్కరణలో బడేసాబ్, కంఠం మనోహర్‌రెడ్డి, డా॥నాళేశ్వరం శంకరం, చోదారపు శ్రీధర్, అధికార భాషా సంఘం అధ్యక్షులు మంత్రి శ్రీదేవి, కృష్ణవర్ధన్, సాహితీ అకాడమీ అధ్యక్షులు జూలూరు గౌరీశంకర్, చంద్రప్రకాశ్‌రెడ్డి, ములుగు అంజయ్య, రామకృష్ణ చంద్రమౌళి, సరోజినీదేవి, డా॥ రాధకుసుమ.

పూలపందుగ...!

బ్రతుకునిచ్చు నమ్మ బంగారుబతుకమ్మ
స్ఫూర్తి కీర్తినొసగి శుభము లిచ్చు
పువ్వు పువ్వులోన పుట్టెడు పుణ్యము
కలుగజేయు మనకు కలిమి బలిమి!

రంగురంగుపూల రాశుల బతుకమ్మ
ఆటపాటలందు నలరు చుండ
అందచందములకు నపురూప దృశ్యంబు
చూసితీరవలయు స్ఫూర్తి ప్రదము!

తేజరిల్లుచుండు తెలంగాణ మందున
మరువలేరు స్త్రీలు మనసు లోన
రాష్ట్రప్రభత తీరు రమణీయ భావన
పల్లె పట్న ప్రజల పారవశము!

మూలకారణంబు ముచ్చట్ల పరువడి
ఆడవారి కిలను హాయి నిచ్చు
మధురమైన గాన మంజుల గీతాల
గౌరిమాత కిచ్చు గౌరవంబు!

పడతులంతకూడి బతుకమ్మలాడుతు
కన్నుల పండువ గాను కాంతులీన
మోదమలరతిరుగ బొడ్డెమ్మ చుట్టును
కొమ్మలంత హాస కోర్మెలమర!

పసుపుతోడజేసి పసిడి గౌరమ్మకు
తీరుతీరుపూల తీర్చిదిద్ది
భక్తి మీర స్త్రీలు బాగుగా కొలువగ
అభయమివ్వుతల్లి నంజలిడుదు!

బంగరుబతుకమ్మ భాతి తెలంగాణ
సాలు సాలు సాగు సంబరమ్ము
జలధి దాటి తాను జగమంత ప్రాకుచు
పూజలందుకొనెడి పూలతేరు!

-డాక్టర్ గన్నోజు శ్రీనివాసాచారి
8555899493

పుస్తక పఠనం సామాజిక ఉద్యమంగా కొనసాగాలి

పుస్తకం మూడు అక్షరాలే అయిన ఎంతో మంది కలలకు, ఉజ్వల జీవితాలకు ఆధారం. పుస్తక పఠనం మనిషిలో విజ్ఞానాన్ని పెంచుతుంది . పుస్తకం సామాన్యుని ఆయుధం. "చిరిగిన చొక్కా అయినా తొడుక్కో కానీ ఒక మంచి పుస్తకం కొనుక్కో" అన్నారు కందుకూరి వీరేశలింగం పంతులు. ఆ మాటలు నేటికి పుస్తక ప్రియుల చేవుల్లో మార్మోగుతూనే ఉంటాయి. ఒక మంచి పుస్తకం వేయి మంది మిత్రులతో సమానమని అన్నారు మరో మహానుభావుడు. ఎందరో మహాను బావులు పుస్తక పఠనం విశిష్టతను ప్రయోజనాలను తెలియచేశారు.

ఒంటరి తనములో తోడుగా ఉండే ఓ మంచి స్నేహితుడు పుస్తకం. "పుస్తకం ఓ మంచి నేస్తం" పుస్తకం అమ్మలా లాలిస్తుంది. నాన్నలా ఆదరిస్తుంది. గురువులా హితబోధ చేస్తుంది. బాధ పడే వారిని ఓదార్చుతుంది. అలసిన మనసుల ను సేదతీరుస్తుంది. అందుకే పుస్తకం అనితరమైన ఆయుధంగా నేస్తంగా అన్ని తరాలను అలరిస్తోంది. జీవితము లోవిజ్ఞానాన్ని సంపాదిం చుకొని ఉన్నత స్థాయికి ఎదగడానికి దోహదపడే సాధనంపుస్తకం. మనోవికాసానికి మార్గనిర్దేశానికి "గురువుగా" ఉపయోగపడుతుంది. పుస్తక ప్రచురణ ప్రారంభమయిన తర్వాత మానవ జీవన గమనంలో విప్లవాత్మక మార్పులు చోటు చేసుకున్నాయి.

ఉదయం టీ తాగితే వచ్చే హాయి పుస్తక పఠనంతో అంత హాయి వస్తుంది అంటారు పుస్తక ప్రియులు . పుస్తక ప్రియులకు అన్నిటినీ మరిపించే విజ్ఞాన, వినోద, వికాస భాండాగారం పుస్తకం. జీవితములో ఉన్నత స్థాయికి ఎదిగిన వారి విజయ రహస్యం పుస్తకం. వారు ఎదిన క్రమంలో అనుభవాలు ఎదురుకొన్నకష్టాలను అక్షర రూపములో అందించి ధైర్యాన్ని ఇస్తుంది పుస్తకం. పుస్తక పఠనం వల్ల సామాజిక అవగాహన సమస్యల పరిష్కార శక్తి యుక్తి ఇనుమడిస్తుంది. సమయానుకూల స్పందనను మెరుగైన ప్రజా సంబంధాలదృఢత్వం తో.

> "పుస్తకాలు దీపాలవంటివి
> వాటి వెలుతురు
> మనో మాలిన్యమనే
> చీకటిని తొలగిస్తుంది"
>
> - డాక్టర్ బి.ఆర్. అంబేడ్కర్

మానవీయ విలువలు రక్షించబడుతాయి . "నా బార్య బిడ్డల కన్న పుస్తకమే నాకు ఎక్కువ. నా ప్రాణం పుస్తకం" అని ఆంబేడ్కర్ అన్నారు. పుస్తకాలకు ఆయన అంత విలువ నిచ్చే వారు.

ప్రస్తుతం అన్ని వయసుల వారు పుస్తకాలకు దూరమా టివి చూస్తూ, వీడియో గేమ్స్ ఆడుతూ మానవ సంబంధాలు లేకుండా ఒంటరి జీవితానికి అలవాటు పడడం శోచనీయం. ఎప్పుడు సోషల్ మీడియాలో వుంటు కాలం గడిపే దుస్థితిలో కూరుకు పోవడం వల్ల ఒత్తిడికి లోనవుతున్నారని అనేక అధ్యయనాలు తెలుపుతున్నాయి. పుస్తకాలను మ్యూజియంలో పెట్టుకొని చూడడం తప్ప చదవడానికి ఆసక్తి చూపడం లేదు.

మనోవికాసానికి మార్గదర్శి పుస్తకం

ఓ మంచి పుస్తకం చదవడంలో ఉన్న ఆనందం అనుభవంతో తెలిసివస్తుంది. పుస్తకాన్ని చదవడంతో మనోవికాసం కలిగి నూతన ఆలోచనలు జనిస్తాయి . పుస్తకం అజ్ఞాన్ని తొలిగించి విజ్ఞాన్ని అందిస్తుంది . గురువులా బోధిస్తుంది. ఒంటరితనంలో స్నేహితుడి లాగా అక్కున చేర్చుకుం టుంది. బాధపడే వారిని ఓదారు స్తుంది .అలసిన మన సుకు సేద తీరుస్తుంది .అందుకే పుస్త కం పఠనం తర తరాల సంస్కృతిని అందిస్తుంది. మానవ నాగరికత చరిత్ర వారసత్వం జాతి ఔన్నత్యం పట్ల అవగాహనకు పుస్తక పఠనం "వారధిగా" నిలవడం గమనార్హం.

మంచి పుస్తకం జీవితాన్ని మారుస్తుంది ఉన్నాయి. సమకాలీన సమాజములో సామాజిక' సాంకేతిక మార్పులు ఎన్ని వచ్చిన పుస్తక ప్రియులా పుస్తకాన్ని వదలలేదు. సినిమాలు' టివిలు 'ఇంటర్నెట్ మొబైల్' మాయలు దరి చేరిన పుస్తకం విలువ తగ్గలేదు.

"మనల్ని గుచ్చి గాయపరిచి ఇబ్బంది పెట్టే రచనలు చదవాలి.

మంచి పుస్తకం మనలో దాగి వున్న ప్రతిభను సృజనను తట్టి లేపాలి.

పుస్తక పఠనం మనలో గడ్డ కట్టిన సముద్రాన్ని గొడ్డలి లాగా పగుల కొట్టాలి" అంటాడు ప్రముఖ రచయిత కాఫ్కా.

"పుస్తక పఠనం ఆరోగ్యానికి మేలు" పుస్తక పఠనం ఆరోగ్యానికి మేలు చేస్తుంది. మేధస్సు సక్రమంగా పనిచేస్తుంది పాజిటివ్ ఆలోచనలు ప్రేరేపిస్తుంది. నెగెటివ్ దృక్పథాన్ని అరికడుతుంది. శ్రీపుస్తక పఠనం బహుళ ప్రయోజనాలను నూతన ఆలోచనలు సృజన శక్తి తాత్వికత శాస్త్రీయత పరిశీలన పరిశోధన పరిష్కారం సామర్థ్యం నూతన ఆవిష్కరణలకు దోహదపడుతుంది.

విశ్లేషణా సామర్థ్యాలను. పెంపొందిస్తుంది.

'పుస్తకంపఠనం ఒత్తిడిని తగ్గిస్తుంది.'

అనవసర ఆలోచనలు నియంత్రిస్తుంది. శారీరక మానసిక ఆరోగ్యం చేకూరుతుంది. ఒత్తిడి నుండి విముక్తి చెందాలంటే రాత్రి పడుకునే ముందు సాహిత్యానికి సంబందించిన పుస్తకాలు చదవడం మంచిది. శారీరక మానసిక ఆరోగ్యం సిద్ధిస్తుంది .అలాగేఏకాగ్రత చేకూరి ఒంటరి తననాన్ని దూరంచేస్తుంది. ఎదిగే పిల్లలకు ఒక్కో వయసులో ఒక్కో తరహా పుస్తకం అవసరం. ప్రారంభంలో బొమ్మలు కథలు పుస్తకాలు మొదలుపెట్టి నాగరికతలు 'పరికరాలు 'సాహస గాదలు ' మహనీయుల జీవిత చరిత్రలు ' శాస్త్రవేత్తలు' శాస్త్రవేత్తల 'పరిశోధనలు' మొదలగు అంశాల మీద అవగాహన చైతన్యం కలిగించడానికి అవసరమయ్యే పుస్తకాలు చదివే అలవాటు జీవన విధానములో బాగం కావాలి .

ఏప్రిల్ 23న ప్రపంచ పుస్తక దినోత్సవం. ప్రపంచ వ్యాప్తంగావేరు వేరు (విభిన్న) తేదీలలో జరుపుకుంటున్నప్పటికి ఇన్ని ప్రత్యేకతలు వున్న ఏప్రిల్ 23 వ తేదీని ప్రపంచ పుస్తక దినోత్సవం పాటించాలని 1955 లో యునెస్కో ప్రకటించింది. అంతే కాకుండా ప్రపంచ పుస్తక కాపీ హక్కుల దినంగా జరుపాలని రచయితలు ప్రచురణ కర్తలు పాఠకులు ఉపాధ్యాయులను ఈ రోజు గౌరవించాలని సూచించింది. ప్రపంచవ్యాప్తం గా అన్ని దేశాలలో ''పుస్తక మహోత్సవాన్ని'' నిర్వహిస్తారు ఏప్రిల్ 23వ తేదీన ప్రపంచ పుస్తక దినోత్సవం పాటించాలని పారిస్ లో 1955లో జరిగిన యునెస్కో సాధారణ సమావేశములో 23 ఏప్రిల్ ను ప్రపంచ పుస్తక కాపీ రైట్ దినోత్సవం గా ప్రకటించింది.

భారత్‌లో చదువరుల సంఖ్య ఎక్కువ

ప్రపంచంలో పుస్తకాలు చదివే (పాఠకులు) చదువరుల సంఖ్యమీద జరిపిన సర్వేలో భారతదేశంలో చదివే వారు ఎక్కువ ఉన్నట్టు తేలింది. ఈ సర్వే పలు ఆసక్తికర విషయాలు వెల్లడించింది. ప్రపంచంలో అందరి కన్నా ఎక్కువ పుస్తకాలు చదివే వారు భారతీయులే . భారతీయులు వారానికి సగటున 10.2 గంటలపాటుపుస్తక పఠనం చేస్తారని దశాబ్దం కింద చేసిన ఒక అధ్యయనములో తేలింది. 2013 నాటి సర్వే ప్రకారం పుస్తక పఠనం సమయం 10.4 గంటలకు పెరిగింది. టీవీలు సినిమాలు ఇంటర్నెట్ వినియోగం మారుతున్న జీవనశైలివల్ల పుస్తక పఠనము పై మోజు తగ్గలేదు. పుస్తక పఠనం లో భారత్ టాప్‌లో వుండడం గర్వించదగిన అంశం (గమనార్హం) పుస్తక పఠనం చేసే వారి సంఖ్య మరింత పెరగాలని పుస్తకప్రియులు కోరుకుంటున్నారు. ప్రస్తుత టెక్నాలజీ యుగంలో ఉరుకుల పరుగుల జీవితంలో పుస్తకపఠనం తగ్గిపో యింది ఆన్లైన్లో చదువుతున్నారు. పుస్తకాలు పట్టుకుని పఠనం చేయడం మర్చిపోతున్నారు. అందుకే కొన్ని స్వచ్ఛంద సంస్థలు తమకు తోచినట్టుగాపుస్తక పఠనం పట్ల ప్రజల్లో ఆసక్తి కలిగించే ప్రయత్నం చేస్తున్నాయి. అందులో భాగంగా పుస్తక ప్రదర్శన పుస్తక పఠనం వల్ల కలిగే ప్రయోజనాలపై సెమినార్లు సదస్సులు వివిధ ప్రతిభ పాటవ పోటీలు నిర్వహించడం గమనార్హం.

ప్రభుత్వం పౌరసమాజం

'పౌరసమాజం' స్వచ్ఛంద సంస్థలు ధార్మిక సంస్థలు 'మహిళా సంఘాలు 'యువజన సంఘాలు విద్యార్థి సంఘాలు' ఉద్యోగ సంఘాలు' గ్రంధాలయాలస్థాపనకు నిర్వహణకు పూనుకోవాలి. పఠనం తో పరిజ్ఞాన పరివ్యాప్తిలో క్రియాశీలక భాగస్వాములు కావాలి. పుస్తకాలు చదివే లక్షణం వాతావరణం ప్రజల్లో కలిగించాలి.

పుస్తకాలు కొని చదివే సంస్కృతిని పెంపొందించడం. పుస్తకాలు ప్రపంచానికి చేసిన సేవలు గుర్తు చేసుకోవడం కొత్త తరాలను పుస్తక పఠనం వైపు ఆకర్షించడం దిశగాకృషి జరగాలి.

కేంద్ర 'రాష్ట్ర' స్థానిక ప్రభుత్వాలు పౌర గ్రంధాలయాలు స్థాపనకు పూనుకోవాలి. పాఠశాల కళాశాల స్థాయిలో లైబ్రరీ లలో డిజిటల్ టెక్నాలజీ ఆధునిక సమాచార సౌకర్యాలను ఏర్పాటు చేయాలి. ఆధునిక టెక్నాలజీ ఉపయోగించి మౌలిక సదుపాయాలు కల్పించాలి. పాఠకులకు మెరుగైన సేవలు అందించాలి. మానవ వనరుల సర్వతో ముఖాబివృద్ధికి దోహదపడే బహుముఖ చర్యలుచేపట్టి 'విజ్ఞాన భారత్' నిర్మాణానికి పటిష్ట కార్యాచరణ ప్రణాళికతో సమగ్రమైన చర్యలకు సంసిద్ధం కావాలని ఆశిద్దాం .

-నేదునూరి కనకయ్య
9440245771

ఆశ (కథ)

అనగనగా అనంతపురం అనే రాజ్యంలో కృష్ణయ్య అనే ఒక రైతు ఉండేవాడు. అతడు చాలా మంచి వాడు, నమ్మకస్తుడు. అతడు చాలా పేదవాడు. అతనికి ఎవ్వరూ లేరు. ఆ రాజ్యానికి రాజు పేరు 'శివరామ చంద్ర' చక్రవర్తి.అతడు చాలా మంచివాడు. తెలివైన వాడు. కృష్ణయ్య, శివరామచంద్ర మంచి స్నేహితులు ఎలాగంటో"ఒకరోజు శివరామచంద్ర కృష్ణయ్య పోలం యొక్క మార్గం నుండి వెళ్తూ ఉంటే అతడి మీద దుండగులు దాడి చేశారు. ఆ దుండగుల నుండి కృష్ణయ్య శివరామ చంద్రను కాపా డాడు, శివరామచంద్ర కృష్ణయ్యకు ధన్యవాదాలు చెప్పి ధనం ఇచ్చాడు, కృష్ణయ్య "నాకు ఇతరుల ధనం అవసరం లేదు", అని అన్నాడు.

అతని నిజాయితీకి మెచ్చి శివరా మచంద్ర అతనితో స్నేహం చేయడం మొదలుపెట్టాడు.అలా వారు ఇద్దరూ మంచి స్నేహితులు అయ్యారు. ఒకరోజు రాజ్యంలోకి వేణువర్మ అనే వ్యక్తి అతిథిగా వచ్చాడు. అతడు చాలా చెడ్డవాడు అతడు కోటీశ్వరుల తో స్నేహం చేసి వారి దగ్గర మంచివాడిగా నటించి వారి ఆస్తిని దోచుకుంటూ ఉండేవాడు. అతడు శివరామచంద్రతో స్నేహం చేసి తనని మోసం చేసి తన ఆస్తిని,రాజ్యాన్ని దోచుకోవాలని వచ్చాడు. అతను నేరుగా మహారాజు యొక్క రాజ భవనం లోపలికి వెళ్ళి దొంగచాటుగా ఒక నకిలీ పాముని విసిరాడు. అది మహారాజు యొక్క కాళ్ళమీద పడబోతుండగా వేణువర్మ వెంటనే వెళ్ళి ఆ పాము బొమ్మను పట్టుకుని బయటకు విసిరేసాడు. శివరామ చంద్ర ఇదంతా చూసి వేణువర్మ తన ప్రాణాలను కాపాడాడని తను వేణువర్మతో స్నేహం చేయడం మొదలుపెట్టాడు. శివరామచంద్ర కృష్ణయ్యకు వేణువర్మను పరిచయం చేసి జరిగిందంతా చెప్పాడు. కృష్ణయ్యకు అతని మీద అనుమానం వచ్చింది. ఒకరోజు శివరామచంద్రకు వేణువర్మ ను కలవాలని కోరికపుట్టి వీలుకాక కృష్ణయను పిలిచి "కృష్ణయ్య వేణువర్మను రాజ భవనానికి తీసుకుని రా," అని చెప్పాడు. కృష్ణయ్య వేణువర్మ యొక్క అతిథి గృహానికి వచ్చాడు. అతను లోపలికి రాబోతుండగాఆ గృహము నుండి వేణువర్మ"రేపు శివరామచంద్రకు మత్తుమందు ఇచ్చి అతని రాజ్య కోసాగారం యొక్క తాలాలను తీసుకుని మొత్తం డబ్బు, నగదు తీసుకుని వెళ్ళిపోతా! హహహహహ," అంటూ గంభీరంగా నవ్వుతూ తనలో తానే మాట్లాడుకున్నాడు. కృష్ణయ్య ఆ మాటలు విని కంగారు పడి"ఇదంతా శివరామ చంద్రకు చెప్పాలి,"అని అనుకున్నాడు. కృష్ణయ్య పరిగెత్తుతూ రాజ భవనానికి వెళ్లి జరిగిన విషయమంతా శివరామ చంద్రకు జరిగిన విషయమంతా చెప్పాడు. శివరామచంద్ర ఆ విషయాన్ని నమ్మలేదు. కృష్ణయ్యకు ఒక ఉపాయం తట్టింది. తదుపరి రోజు కృష్ణయ్య ఒక వైద్యుడి దగ్గర నిజం చెప్పే మందు' కొన్నాడు. కృష్ణయ్య వేణువర్మను రాజ భవనం దాకా అతడిని దొంగచాటుగా వెంబడిస్తూ వచ్చాడు. వేణువర్మ రాజ భవనానికి ప్రవేశించాడు. అతడు శివరామచంద్రతో మాట్లాడుతూ ఉన్నాడు. అతడికి చాలా దాహం వేసింది. అది శివరామచంద్ర గ్రహించి సేవకుడిని నీరు తెమ్మని చెప్పాడు. కృష్ణయ్య ఇదే తన పథకాన్ని అమలు చేయడానికి సరైన సమయం అని అనుకొని నిజం చెప్పే మందు'ను ఆ నీటిలో దొంగచాటుగా కలిపాడు. ఆ నీటిని వేణువర్మ త్రాగాడు. అంతే! మొత్తం తన పథకాలు అన్నింటినీ శివరామచంద్రకు చెప్పేశాడు. ఆ తర్వాత స్పృహ తప్పి పడిపోయి కొద్దిసేపు తర్వాత లేచాడు. శివరామ చంద్రకు కోపం వచ్చి, వేణువర్మను చంపబోతుండగా కృష్ణయ్య అతనికి నచ్చ చెప్పాడు. శివరామచంద్ర వేణువర్మను రాజ దర్బారుకు తీసుకు వెళ్ళి అతడు దోచుకున్న డబ్బును వారి-వారి రాజ్యాలకు అప్పగించాడు వేణువర్మను కారాగారంలో బంధిం చాడు. కృష్ణయ్య తెలివి తేటలకు నిజాయితీకి మెచ్చి అతడిని తనకు ప్రధాన అంగరక్షకుడిగా నియమించాడు. కృష్ణయ్య చాలా సంతోషించాడు. అలా రాజ్యము అంతా సంతోషంగా ఉంది.

-నీతి:ఎవ్వరైనా మనకు ఎంత డబ్బు
ఆశ చూపించినా మనం ఆశ
పడవద్దు.లేదంటే మనం
మోసపోక తప్పదు.
ఒకరితో స్నేహం
చేసేటప్పుడు వారు
మంచివారా చెడ్డవారా
తెలుసుకోవాలి.

-వలిపే రామ్ చేతన్
7వ,తరగతి

పుస్తక సమీక్ష

ఓం నమో.. 'చంద్రశేఖరా'

రుద్రాక్షలమఠం ప్రభులింగశాస్త్రి గారు రచించిన శతకం "చంద్ర శేఖరా!" అనునది ఆధ్యాత్మికతనే పరమ సత్యంగా తీసుకుని రచించినది. మరో విధంలో స్త్రీల పట్ల అపారమైన భక్తి భావాలను కూడా నిలిపారు. ఒక స్త్రీని అందరూ అనుకుంటున్నట్లుగా తల్లి, భార్య కూతురు, మనవరాలు వంటి అనేక పాత్రల ద్వారా అందించే సేవ అపూర్వమైనవి అంటారు. స్త్రీ విశ్వ శ్రేయస్సును కోరే మహోన్నత రాలుగా వర్ణించడం ఈ శతకంలో మనకు కనిపిస్తుంది. అందుకు తన తల్లి గారైన చంద్రశేఖరమ్మగారిపై గల ప్రేమను, భక్తిని, గౌరవాన్ని చూపుతూ 'చంద్రశేఖరా' అనే మకుటంతో రచించడమే తార్కాణం. ఈ శతకమంతా వీరశైవ ఆధ్యాత్మిక తను ప్రతిపాదిస్తూ సాగడం విశేషం. ఆధ్యాత్మికతతో పాటు భారతీయ జీవన విధానాలూ, పద్ధతులూ, సంప్రదాయాలు, ఆత్మీయతలూ కూడా ఈ గ్రంథంలో విశదీకరింపబడ్డాయి. ముఖ్యంగా విశ్వమంతా లింగస్వరూపమేనని, నీవు, నేను అనే భేదాలు లేని లోకమంతా ఈశ్వర స్వరూపమేనని ఖచ్చితంగా తెలియజేసారు. భక్తులకు సుఖాలలో కంటే దు:ఖాలలో నిత్యం తోడు ఉంటాడని వివరణలతో సహా మనకు తెలిపారు. ఒకచోట వివాహ వ్యవస్థను గురించి తెలియ జేస్తూ.. భార్యంటే ఒక్క తరానికే కాదు భావి తరాలకు భారతి అని వర్ణించడం ఎంతో హృద్యంగా ఉంది. ఈ నాడు వివాహ వ్యవస్థ ఇంకా నిలబడింది అంటే అందుకు కారణం భార్య మాత్రమేనని ఖచ్చితంగా తెలియజేస్తారు. ఒకవైపు భర్త, మరోవైపు పిల్లలు అంటూ ఆహోరాత్రులూ వారిని కాపాడుకుంటూ, తన కష్టాన్ని కనీసం తెలియనీయకుండా, తనకు శారీరకంగా, మానసికంగా బాగోలేకున్నా ఏమాత్రం కనిపించనీయకుండా సంసారాన్ని తీర్చిదిద్దే ఉన్నతురాలు అని వర్ణించడం చదువుతుంటే నిజంగా కళ్ళు చెమ్మ గాకుండా పోలేదు. జీవితంలో ఎన్ని ఆశలున్నా, ఆశయాలున్నా, అన్నింటికంటే ముందుగా మనసు ఆ దేవుని భక్తిలో నిండిపోవాలనీ, చేస్తున్న కర్మలలో ధర్మాన్ని పూర్తిగా నింపడమే ఈశ్వర తత్త్వమనీ తెలిపారు.

ఈ శతకంలో కనిపించే స్త్రీ ఔన్నత్యం చదువుతుంటే స్త్రీలందరికీ ఎంతో ఆత్మస్థైర్యాన్ని నింపుతుందని తెలి పారు. వీర శైవ తత్త్వాన్ని ప్రభోధిస్తూ స్త్రీ గొప్పదనాన్ని దాపుగా ఉంచడం తీరు చూస్తుంటే వీరిలో విజ్ఞత ఎంత లోతుగా ఉందో అర్థమవుతుంది.

"నర్తకుడే కదా శివుడు నర్తన మేదన చెప్పగల్గగా" అనడం మరొక చోట

" మృత్పిండ మేకో బహు బాండ రూపం/ సువర్ణ మేకో బహుభూషణాని/ గోక్షీరమేకో బహుదేను జాత:/ ఏక: పరాత్మ బహుదేహవర్తి" అన్నట్లుగా అన్ని తానే అయినప్పుడు కర్త ఎవరు? భర్త ఎవరు? నర్తన అనిన ఏమి? అనే విషయాలను తాను ఆకళింపు చేసుకుంటూ జనులను జాగృత పరిచారు. సత్వ, రజో, తమో గుణ విశ్లేషణ చేసి వల బీజ వృక్ష తత్త్వాల మాదిరిగా అమోఘ ంగా అభివర్ణించడం విశేషదాయకం. ఇలా అన్ని అంశాలను అక్షరీకరించి, జీవులకు సంస్కారాలను మానవునికి తెలియజేయడం అనేది ఈ గ్రంథం లోని విశిష్టత..

మరొక ముఖ్య విషయం ఏమిటంటే స్త్రీ అనే పదాన్ని విడమరచి త్రిగుణాత్మకం అంటూ స,ర,త (ఈ) ఇందులో నుడి వుంది. అందుకే ఆదిపరాశక్తి అమ్మై మనలో వసిస్తుంది అని వివరిస్తారు. అలాగే 'అహం', 'అ' అక్షరమాలలో మొదటి వర్ణం. 'హ' చివరి వర్ణం 'ం' పూర్ణ బిందువు ఉభయాక్షరం కావున నేను లేనిదేదీ నేనే సర్వం అని అందరికి తెలియజేసున్నారు.

మనిషి ఆదర్శవంతుడుగా జీవించి మోక్ష సాధకుడై గురువును ఆశ్రయించి సత్యాసత్యాలను గ్రహించి నశ్వరమైన ప్రపంచ భోగాలవైపు పరుగులెత్తకుండా, ఆ భగవంతుని సాన్నిధ్యానికి అంతి ప్రశాంతంగా వెళ్ళడానికి సాధన చేయాలంటారు. శూన్యం అనేది ఏమీ లేనిది కాదు. ఎన్నో విశేషాలను మోసుకొచ్చేది అంటూ అభివర్ణిస్తారు. ఈ శతకంలో మకుటం "చంద్రశేఖరా' అనే పదానికి ఔచిత్యాన్ని గ్రహించి కాస్తంత ఓపికతో చదివిన ప్రతి పాఠకుడి జీవితం మోక్ష సాధనవైపు నడుస్తు ందని తెలియజేస్తూ.. ప్రభులింగశాస్త్రి గారికి ప్రణామములు..

ప్రతులకు: రుద్రాక్షల మఠం ప్రభులింగశాస్త్రి
ఫోన్: 6305890867

-శైలజామిత్ర

నానీలు

నిజాయితీగా
పన్ను కట్టే ఉద్యోగులు
దర్జాగా ఎగ్గొట్టే
ధనవంతులు!

అవ్వెల్లో
పనులు సులభమే
ఆదమరిస్తే
అంతా మోసమే!

పెద్దక్షరాలతో ప్రచారం
తగ్గింపు ధరలు
కనపడకుండా
షరతులు!

దోషులను తప్పించే
దొడ్డిదారి ప్రయత్నాలు
దొరికిన నిర్దోషి
దోషి!

అంబరాన్నంటాయి
సంబరాలు
మసకబారాయి
అసలు పరిస్థితులు!

-చంద్రకళ. దీకొండ
చరవాణి:9381361384

పుస్తక సమీక్ష

జాతీయాలతో పరిపుష్టం 'ఆకులు రాలుతున్నయి'



దీర్ఘకాలంగా కవిత్వ సాధన చేస్తున్న మంజీర కవుల్లో ప్రముఖంగా చెప్పుకోదగ్గవారు కొమురవెల్లి అంజయ్య. గత ఐదు దశాబ్దాలుగా ఆయన కవిత్వం తెలుగు నేలపై వినిపిస్తూ ఉంది. ఒకవైపు కవిత్వ రచన, మరోవైపు సాహిత్య సంస్థల బాధ్యతల నిర్వహణతో పాటు జర్నలిస్టుగా తలమునకలయ్యే పనిలో నిమగ్నమైనవారు అంజయ్య. కరోనా నేపథ్యంలో ఆయన రాసిన కవితల సంకలనం 'ఆకులు రాలుతున్నయి'. ఈ కవితా సంకలనంలో అడుగడుగునా సామెతలు, జాతీయాలు కనబడతాయి. విషయ వ్యక్తీకరణలో కవి నైపుణ్యం కళ్లకు కట్టినట్టు కనబడుతుంది.

కరోనా పుట్టుక ఇప్పటికీ అంతుచిక్కని రహస్యమే. వూహాన్ పరిశోధనాశాలలో శాస్త్రవేత్తలు రూపొందించినట్టుగా ఆరోపణలు ఉన్నాయి. కానీ నిజం ఇప్పటికీ నిగ్గు తేలలేదు. దీనిపై కొమురవెల్లి అంజయ్య రాసిన కవిత 'రహస్య గానం'. సామెతలు, జాతీయాల ప్రయోగంలో ఈ కవి నైపుణ్యానికి ఈ కవిత ఒక మచ్చు తునక. ఈ కవిత నిండా లెక్కలేనన్ని జాతీయాలు. అపరిమితంగా సామెతలు. అడుగడుగునా కవి కౌశలం పాఠకుడి మదిని దోచుకుంటుంది.

"చీమకాలంతయినా, హిమాలయాలంత ఎత్తయినా
మరో చేవి కొరకనంతవరకే రహస్యం"

ఈ పంక్తుల్లో 'చెవి కొరకడం' అనే జాతీయాన్ని చూడవచ్చు. దీనికి అర్థం రహస్యంగా చెప్పడం/ రహస్యాన్ని చెప్పడం. ఎంత చిన్నదయినా, ఎంత పెద్దదైనా రహస్యం మరొకరికి చేరేంతవరకే గుట్టు. మరో చెవిని చేరిన రహస్యం బహిర్గతం.

''దాగుడుమూతలాటలో తప్పించుకోవడం
కళ్లకు మాయపొర కమ్మేలా చేయడం"

'కళ్లకు పొరలు కమ్మడం' అనే జాతీయాన్ని ఇక్కడ ప్రయోగించారు. భ్రమల్లో ఉంచడం అని దీని అర్థం. రహస్యం తెలియకుండా చూడడమని ఈ సందర్భంలో అర్థం.

"జుట్టున్న కొప్పు అహంకారాలు
దొరకనంతవరకన్నీ దొరల్లా విర్రవీగే బొర్రలే"

'జుట్టున్నమ్మ ఏ కొప్పు పెట్టినా అందమే' అని సామెత. జుట్టు అహంకారానికి దారి తీస్తుందని ఈ సామెత నుండి కవి గ్రహించిన సత్యం. అందుకే దీన్ని మార్చి 'జుట్టున్న కొప్పు అహంకారాలు'గా ప్రయోగించారు కవి. 'దొరకనంతవరకు దొర-దొరికితేనే దొంగ' అని మరో సామెత. ఈ సామెతను కూడా కవి మార్చి ప్రయోగించారు. పైన కొప్పు స్వభావంగా అహంకారాన్ని పేర్కొన్న కవి దొర స్వభావంగా విర్రవీగడాన్ని ఉపయోగించారు.

"పరువు గంగలో మురికి నీటి పారుకం
ఎందరెంత జుట్టు పీక్కున్నా
తలలు బద్దలు కొట్టుకొని తబలా వాయించినా..."

ఈ పంక్తుల్లోనూ జాతీయాలు కనబడతాయి. 'పరువు గంగపాలు కావడం', 'జుట్టు పీక్కోవడం', 'తలలు బద్దలు కొట్టుకోవడం' అనే జాతీయాలను చూడవచ్చు. వీటిలో 'పరువు గంగపాలు కావడం' అనే జాతీయాన్ని మార్చి ప్రయోగించిన తీరు పాఠకులను ఆకర్షిస్తుంది. పరువు గంగపాలు కావడంతో పాటు ఆ నీటిలో మురుగు నీరు పారిందట.

ఈ కవిత తర్వాతి 'గజిబిజి తావ్వ', 'మనమే జాగ్రత్తగా', 'నగరానికే మైంది' కవితల్లో 'కొరకరాని కొయ్య', 'ముడితే కందిపోవడం', 'కంట్లో దూలం', 'తేళ్లు, జెర్రులు పాకడం' మొదలైన జాతీయాలను ప్రయోగించారు కవి అంజయ్య.

విపత్తుల వల్ల వ్యక్తిగత స్థాయిలో జరిగే నష్టంతో పాటు వ్యవస్థ స్థాయిలోనూ నష్టాలు కలుగుతాయి. ఈ నష్టాలను మూడే వాక్యాల్లో సమర్థవంతంగా తెలియజేస్తారు.

"విపత్తు తరిమితే
ప్రణాళికల పేజీలు పనికి రాకుండా పోతాయి
జమలకంటే ఖర్చులే గుట్టలెక్కుతాయి"

ఆకస్మికంగా వచ్చే విపత్తుల కారణంగా ప్రభుత్వాలు, సంస్థలు రూపొందించుకున్న ప్రణాళికలు నిర్ధారించుకున్న లక్ష్యాలను సాధించలేవు. ప్రజలు ఇబ్బందులు కారణంగా పన్నులు కట్టలేని పరిస్థితి ఏర్పడుతుంది. దాంతో ఖజానాకు రాబడి గణనీయంగా తగ్గిపోతుంది. సంక్షేమ విధులను నిర్వహించాల్సిన దృష్ట్యా ఆరోగ్యం, పునరావాసం మొదలైన రంగాలలో ఖర్చులు పెరిగిపోతాయి. 'ఆకాశాన్నంటడం' అనే జాతీయం పాతబడి పలుచనైపోయిన ఈ కాలంలో గుట్టనెక్కడం కొత్త ప్రయోగం.

'పిల్లికి చెలగాటం- ఎలుకకు ప్రాణ సంకటం' అని లోకోక్తి. కోవిడ్ నేపథ్యంలో పిల్లి స్థానాన్ని వైరస్ ఆక్రమించింది. ఇక ఎలుకలు ప్రజలే కదా! ఈ విషయాన్నే 'జోష్' అనే కవితలో కింది విధంగా కవి ప్రస్తావిస్తారు.

"శత్రువుతో సహజీవనం
'పిల్లికి సంబరం ఎలుకలకు ప్రాణ సంకటం'
వైరస్ వయ్యారిభామ కలుపు మొక్కలకు
దెబ్బతింటున్న వంటల బతుకులు"

ఈ పంక్తుల్లో వైరస్ వల్ల బతుకులు ఛిద్రం అయ్యేందుకు మరో రెండు పోలికలను ఏకకాలంలో వివరిస్తారు కవి అంజయ్య. కలుపు మొక్కల వల్ల పంటలు పాడు కావడం, పిల్లి వల్ల ఎలుకల ప్రాణాలకు గండం రావడం, బతుకలను వైరస్ కబళించడం- ఈ మూడింటి మధ్య పోలికను తనదైన శైలిలో కవి వివరిస్తారు.

'కట్టడి మరుస్తే' అనే కవితలో ప్రారంభ పంక్తులను కిందివిధంగా రాశారు అంజయ్య.

"భయంలేని బాతు గుడ్లు పెడ్తది బజార్ల
పాలు తాగే పిల్లి కళ్లు మూసుకొని
ఎవరూ చూస్తలేరనుకుంటుంది"

ఇదే కవితలో మరి కొన్ని పంక్తులు ఇలా ఉన్నాయి.

"కరోనా కల్లుతాగిన కోతిలా కరుస్తుందని
లాక్-డౌన్ కు చప్పట్లు కొట్టాం, దీపాలు వెలిగించాం"

ఈ పంక్తుల్లో మూడు జీవాల గురించిన ప్రస్తావన ఉంది. ఒకటి బాతు, రెండోది పిల్లి, మూడోది కోతి. 'భయం లేని బాతు బజార్లో గుడ్లు పెడుతుంద'ని లోకోక్తి. 'పిల్లి కళ్లు మూసుకుని పాలు తాగుతూ తనను ఎవరూ గమనించలేరనుకుంటుంద'ని మరో లోకోక్తి. 'కల్లు తాగిన కోతిలా ప్రవర్తించడం' జాతీయం. ఈ మూడింటినీ ఈ కవితలో ప్రయోగించి, జాతీయాలూ లోకోక్తుల ప్రయోగంలో తనకున్న ప్రతిభను నిరూపించుకున్నారు కవి.

తెలంగాణ నుడికారాన్ని తన కవిత్వంలో సమర్థవంతంగా ప్రయోగించారు అంజయ్య.

'క.. రోనా' అనే కవితలో కవి కిందివిధంగా రాశారు.

"రోగం పలకరిస్తే ఊరడింపు లుండవు
సానుభూతుల మాటలు సల్ల చిలుకవు"

ఇక్కడ 'సల్ల చిలుకడం' అనే తెలంగాణ పదబంధాన్ని ఉపయోగించడం కనబడుతుంది. దీని అర్థం 'సాంత్వన అందించడం'.

'నాలుగు తల్లెలు' శీర్షికలోనే తెలంగాణ మట్టి భాష కనబడే కవిత. ఈ కవిత ఒక చక్కటి సందేశాన్ని ఇస్తుంది.

**''కోల్పోయిన విలువలకు చేసుకోవాలి కొత్త పండ

చతుర్వేదసారం

సప్తసింధు ఏడు నదులప్రాంతం
హిందు పదమూలం 'సింధు'
హిందు తొలుత వాడింది పార్శీలు
పార్శీలో హిందు పద అర్థం
సింధు నదితీరవాసులనీ
అందరికీ ఆచరణీయమైంది "ధర్మం"
మానవ సత్సంకల్పాలు
ఇతరులకు నష్టం కాకుండా
నెర వేర్చుకోవడం ధర్మం
ఇది ఒక గొప్ప సూత్రం
కొందరి అభిప్రాయమైనదే "మతం"
వేదం విద్ ధాతు ఉద్భవం
విద్ అర్థం జ్ఞానం
వేద సంబంధ మతాలు
ఆచరించే వారేహిందువులు
ఇది జగతిలో అతిపెద్ద
మూడవమతం
వేదాంతం,తత్త్వం, పురాణాలు,
ఉపనిషత్తులు,ఆగమాలు,
మహాకావ్యాలు రామాయణం,మహాభారతం,
భగవద్గీత అన్నీ వేదాల సారమే,
ఋగ్వేదం యాగాలలో దేవతాహ్వానం
యజుర్వేదం యాగబలి
దానంలో చెప్పే మంత్రాలు
సామవేదం మృదుమధుర
మంత్రాలు
అధర్వణవేదం ఆత్మ ప్రేతాత్మల
సంబంధ మంత్రవిద్య
హిందుత్వం వైవిధ్యభరితం
నీతి, నియమాలు, విధులు, సంసారం,
మోక్షం,యోగం లతో ప్రబలం
మానవుని కర్తవ్యాలు నాల్గు
ధర్మం, అర్థం, కామం, మోక్షం
మోక్షమార్గాలు నాలుగు
జ్ఞాన, కర్మ, భక్తి, క్రియా మార్గాలు
అందరిచే ఆమోదితం భక్తిమార్గం
ఇది బ్రహ్మ అంటే పరమాత్మ
సృష్టి, స్థితి, లయకర్తగా ఆరాధిస్తారు
ఇది రెండు రకాలు
అద్వైతం, ద్వైతం
ఆత్మ జ్ఞానమే బ్రహ్మజ్ఞానం అద్వైతం,
ద్వైతంలో ఆత్మ, పరమాత్మ వేరు
దేవతలు స్వర్గలోకవాసులనీ
మానవాళికి సరైన దిశానిర్దేశం
కొరకే అవతారపురుషులు
వెలుస్తారని వారే రామావతారం,
కృష్ణావతారం అని
పుట్టుక, మరణం, పునర్జన్మల
చక్రమే సంసారం అని
హిందూధర్మం గృహస్థు,
సన్యాస ధర్మాలను అంగీకరిస్తుంది
లక్ష్యసాధన మార్గమే యోగం
హిందుత్వంలో వర్ణాలు నాలుగు
బ్రహ్మణ, క్షత్రియ, వైశ్య, శూద్ర
మనుధర్మం స్త్రీల హక్కులను
నొక్కి వక్కాణించింది
మనిషి పూజింపదగినవారు
తల్లిదండ్రులు, గురువులు, దైవం,
అతిథి, పరస్త్రీలు
హిందూత్వ ఆచరణలో
నిత్యదీపారాధన, నైవేద్యం,
వేదపారాయణం, దైవస్తోత్రం,
మంత్ర పఠనం, ధ్యానం, పూజ
వంటివి, కష్టమైనా, నిష్ఠగా,
ఇష్టంగా చేయడమే
హిందుత్వ ధర్మం
అదే సనాతన సుధర్మం

-సంధ్య సుత్రావె,
9177615967

ఆమె జీవితంలో

మౌన రాగాలెన్నో
ఆమె మనసులో అగ్ని వర్షాలు ఉంటాయి
ఆమెలో అడుగడుగునా ఆవేదన భావాల పరంపరలు సాగిపోతాయి
ఆమె హృదయంలో ప్రేమ గీతాల పల్లకి సాగిపోతుంది
ఆమె వేసినటువంటి నవజీవన గీతాలు వెలుగు పందిళ్ళయి పల్లవిస్తాయి
ఆశల తీగల పందిళ్లు వేసి పైపైకి సాగిపోయే మనో గీతిక
పరిమళాన్ని పంచే శక్తి ఉన్న మనిషి ఎక్కడో పాకుడు రాళ్లపై కాలు పెట్టి జారీపడుతుంది
తన హృదయాన్ని పదులపరుచుకుంటే పసందైన భావాలు పరిమళిస్తాయని
కాలంతో పాటు సాగిపోతున్న నూతన వస్త్రధారి
కనుసనల్లో కనుల కొలనులో చల్లని కల్పపూలను విరబూసినట్లుగా
మనసు విపారుతుంది కొందరి కోసమే
ఆమె ఆమె గుండె గుడిలో దుర్మార్గులు నివాసం ఉండకూడదు
ఆమె సన్నజాజి తీగలాగా సాగిపోవాలి జీవన దారిలోసంపెంగ పరిమళమై
తన సహాయకులకు పంచాలి
రాత్రికి రానీలా చల్లని గాలిలో ఆమె మనసు ఎగిరిపోతూ
మంచి చెడుల మధ్య తిరిగే లోలకం డోలనం
అయినప్పటికీ ఒక చల్లని మెల్లని పల్లె ఏరులాగా ప్రకృతి ఒడిలోని
సన్నటి నది పాయలాగా సాగిపోవాలి
కొండ కొమ్మన చల్లని మేఘమాల లాగా ఎగిసి ఎగిసిపోవాలి

-డాక్టర్ సిహెచ్ ఆంజనేయులు
7702537453

కంటి వెలుగులు

సాటి మనిషికి క(న)ష్టం
కల్గించక పోవడం దేశభక్తి!
నీతి నిజాయితీ కూడిన
నిజమైన కర్తవ్యం దేశభక్తి!!

స్ఫూర్తి నింపిన జెండాల
త్యాగమయమైన కీర్తి దేశభక్తి!
ప్రతి నిత్యం భరతమాత
ప్రతిభకై తపించుటే దేశభక్తి!!

వీరుల త్యాగఫలం
పొరుడిగా వృధా కానీకు!
దేశం కోసం నీ బాధ్యత
ఇసుమంతైనా విస్మరించకు!!

పర పాలనను తరిమేసిన
స్వాతంత్ర్య మిదని మరవకు!
స్వార్థపు కోరలకు చిక్కుకొని
జాతి పరువును బలి చేయకు!!

వేన వేల భరత వీరులు
నేలకొరిగి నిలిపిన స్వేచ్ఛ!
దుష్ట శక్తుల అవసరానికి
ఇష్టమైనట్టు మారదు స్వేచ్ఛ!

తరతరాల బానిసత్వపు
కోరలను తెగ నరికిన స్వేచ్ఛ!
ప్రజాస్వామ్య పాలనలో జాతి
జనులు ఆనందించు స్వేచ్ఛ!

-మరికంటి
సెల్: 9640407103

పచ్చని చెట్టై పది మందికి నీడనివ్వాలి

కొలువుల కోసం కొట్లాడిన తనువులన్నీ
పిట్టకు పెట్టి ఎదురు జూసినట్టు ఏండ్ల
తరబడి ఎదురు చూస్తాంటే గిప్పుడు
కండ్లు తెరిచిన సర్కారు సక్కంగా
కొలువుల ఉట్టి కొమ్మ మీద పెట్టింది

నిరాశల సాగరంలో మునిగిన యువత
గిప్పుడు కొత్త ఊపిర్లు ఊదుకోవాలి
పచార్లు కొట్టే పాదాలకు తాళం వేసి
రణరంగంలో సైనికుడిలా
ఆఖరి మోకాకు సిద్ధమవ్వాలి
అక్షరాల పరిమళాలను ఆస్వాదిస్తూ
ప్రశ్నల తేనె తుట్టెకు సమాధానాల
గులేర్ తో గురిచూసి కొట్టి
లక్ష్యాల శిఖరానికి నిచ్చెన వేయాలి

పూట కోసం పరుల ఇంట్లో పాశి పని
చేసే అమ్మ కట్టం యాది చేసుకోవాలి
కంచంలో మెతుకు కోసం కన్నీళ్లు కార్చుతూ
సంసార బండిని గానుగ ఎద్దోలే లాగుతున్న
నాన్న తండ్లాటను తనువు నిండా తలచుకోవాలి
తాత ముత్తాల నుండి తరుముతున్న
పేదరికపు పాముని తరిమికొట్టాలి
తలకిందులై గబ్బిలాల్ల వేలాడుతున్న
జీవితాలను గాడిలో పెట్టాలి,..

అరణ్యవాసాలు, అజ్ఞాతవాసాలు
ఇతిహాసాలు మనకు ఇచ్చిన ఇంధనమే కదా!
బజార్లు తిరగకుంటే బ్రహ్మాండమేమి
బద్దలు కాదు కదా !
సోపతి గాళ్ళతో సెల్ఫోన్ లో
సొళ్ళు కబుర్లు మాట్లాడ కుంటే
విశ్వమంతావిస్ఫోటనం జరుగదు కదా !
మనస్సునంతా ఒక్క చిత్తం చేస్కోవాలి
పుస్తకాల ఆకాశంలోకి శిరస్సును ఒంపి
కొలువును కొట్టే దాకా నిప్పుల కుంపటై
సదా రగులుతూనే ఉండాలి

లక్ష్యాల శిఖరమెక్కి పచ్చని చెట్టై
పది మందికి నీడనివ్వాలి
నిన్ను చూసి ఈసడించిన జనమంతా
జేజేలు కొట్టాలి
మరణం లేని సూర్యుడివై
జగతిలో నిలిచిపోవాలి

- తాటిపాముల రమేష్
7981566031

చావు చిరంజీవి

ప్రాణికేనా
అప్రాణికీ చావుంది
కాల పరిమితి వుంది
నిప్పు మాత్రం చావదూ!

వెలిగినప్పుడు
ఎంత గొప్పగానో వెలిగి
ఒక సామ్రాజ్యాన్ని ఏలుద్ది
చిట్ట చివరికి
ఆరిపోయి పతనమవుద్ది.

-మాధవీసనారా
8639491246

బడిలోనే బతుకు మారేది

బడి బయటి బాలల్లార
బడిలో మీరు చేరండి..!
అక్షరాలు నేర్చుకొని
అజ్ఞానం తొలగించుకొండి..!!

భవితను మార్చుకొని
బంగారుమయం చేసుకోండి..!
అంధకారం తొలగించుకొని
అడుగులు ముందుకేయండి..!!

విద్య విలువ తెలుసుకొని
వివేకవంతులు అవ్వండి..!
విధిరాతలు మార్చుకొని
విజ్ఞానవంతులు అవ్వండి..!!

విద్యను నేర్చుకొని
ప్రశ్నించడం అలవర్చుకొండి..!
విద్యను గైకొని
బానిసత్వాన్ని బలిచేయండి..!!

విద్యయే అన్నింటికిని
ఆధారమని తెలుసుకొండి..!
అవిద్యను ప్రారద్రోలేటి
అయుధమని చాటండి..!!

-పసుల.శంకర్
9542181301

నేనెవరిని

ఎందుకు పుట్టావ్
అంటే చెప్పలేను
ఎప్పుడు పోతావ్
అంటే చెప్పలేను-

ఏంటి నీ గొప్ప
అంటే చెప్పలేను
ఏంటి నీ స్థితి
అంటే చెప్పలేను-

నువు మనిషివా
అంటే చెప్పలేను
నువు మృగానివా
అంటే చెప్పలేను-

ఎందుకంటే
నాలో ఒక మనిషి వున్నాడు
నాలో ఒక మృగమూ వుంది
అందుకని

-వి.సూర్యారావు
92469 11234

ప్రకృతితో చెలగాటమా?

ఇపుడు కాలమేదైనా మనిషిపై
కోపాన్ని వెళ్ళగక్కుతున్నట్లున్నది
కాలం తన నడత మార్చుకున్నది
ప్రకృతిపై మనిషి చేసిన చేస్తున్న
వికృత పోకడలకు ఫలితాన్నిస్తున్నది
ఊహించని పరిణామాలు
ఊహకందని పరిస్థితులు
ఊపిరాడక ఉక్కిరిబిక్కిరి చేస్తూ
ఉక్రోషాన్నంతా
విపత్తుల రూపంలో జవాబిస్తూ
మనిషికి మనుగడనంతా
ప్రశ్నార్థకంగా మార్చేస్తుంది
ప్రకృతెంత నిజాయితిగలదో
మనమేంచేస్తే అదే తిరిగిస్తున్నది
ప్రకృతితో చెలగాటమా?

ప్రకృతి కన్నెర్రజేస్తే
ప్రళయం సంభవిస్తుంది
సాంకేతికంగా ఉన్నతంగా ఎదిగిన
ప్రకృతికి హానిచేయనిదైయుండాలి
కానీ... ఇప్పుడు
మనిషి వికృతపోకడలే
విశ్వవినాశనానికి దారులేస్తున్నయ్
కొత్తకొత్త రోగాలు
రోజుకో రాగమాలపిస్తూ
చావుమేళాన్ని మోగస్తున్నా
పట్టింపసలేలేని మనిషికి
భవిష్యత్తేమిటో మరి!

-సి. శేఖర్(సియస్సార్)
9010480557

పుస్తక సమీక్ష

తెలంగాణ చారిత్రక, సాంస్కృతిక, రాజకీయ ప్రాధాన్యతగల

తెలంగాణ వైభవం

తెలంగాణ చారిత్రక సాంస్కృతిక రాజకీయ ప్రాధాన్యతను కళ్లముందు నిలిపే కవితలు చాలా ఉన్నాయి. "తెలంగాణ వైభవం" కవితా సంకలనం లోని కవితలన్నీ ద్రాక్ష పాకం లాగా సరళంగా ఉన్నాయి. ఇందులో మొత్తం 27 కవితల లో ప్రతి కవిత తెలంగాణ వైభవాన్ని చారిత్రక నేపథ్యాన్ని చాటి చెప్పేవే.

నా తెలంగాణ కోటి రతనాల వీణ అని ప్రసిద్ధి .ఇలాంటి తెలంగాణలో రామ ప్ప దేవాలయం, బాసర సరస్వతి దేవి, సమ్మక్క సారక్క, ఏడుపాయల దుర్గ భవాని, మెదక్ చర్చి, గల గల పారే మంజీర నది, మూసి, కృష్ణ, గోదావరి నదులు, ఈ వీర తెలంగాణ తెలంగాణ సంస్కృతి సంప్రదాయాలకు నిలయమై నది. తెలంగాణ పోరుగడ్డ మతసామరస్యానికి ప్రతీక బతుకమ్మ ,పీర్ల పండుగ, ఎన్నో ప్రాజెక్టులు చారిత్రక కట్టడాలు ఎన్నో పర్యాటక ప్రాంతాలు తెలంగాణ వైభవాన్ని చాటి చెప్పడం మనందరి కనీస బాధ్యతగా భావించాలి.

తెలంగాణ వైభవం కవిత సంకలనంగా తీసుకురావాలనే

ఆలోచన గొప్పది. ప్రధాన సంపాదకులుగా పెందోట వెంకటేశ్వర్లు, సహ సంపాదకులుగా ఎర్రోజు వెంకటేశ్వర్లు వ్యయ ప్రయాసలకు ఓర్చి పుస్తక రూపకంగా తీసుకువచ్చారు. శ్రీవాణి సాహిత్య పరిషత్ , సిద్దిపేట వారి ఆధ్వర్యంలో పుస్తకాలను ప్రచారం లోకి తీసుకు వచ్చిన పెందోట వెంకటేశ్వర్లు గారు, మరొక ఆణిముత్యం లాంటి పుస్తకాన్ని కవితాసంకలనం గా తీసుకు రావడం అభినందనీయం.

నవాబు పాలనలో మగ్గేను తెలంగాణ అంటూ "బంగారు తెలంగాణ" కవితలు అమాయకత్వం అధికమై నవతెలంగాణ కవితలో వివరించారు. తెలంగాణ "వీరులకు కట్టాలి గుండెల్లో స్తూపం" అంటూ చక్కటి కవితను కవి గంగాపురం శ్రీనివాస్ గారు ఆవిష్కరించారు.

తెలంగాణలో ప్రత్యేకంగా కాకతీయులు/ ఏలిన పరంగల్ జిల్లాలో ప్రపంచ/ యాత్ర స్థలాలలో ఒకటైన రామప్ప దేవాలయం

అంటూ మరొక కవి తెలంగాణ యాత్ర స్థలాలు దేవాలయాల గురించి వివరించారు.

బహు భాషలు మాట్లాడగలదిట్టా/ తెలుగు సాహితీవేత్త /సినీ పాటల పుట్ట సినారె అంటూ

సినారె గురించి "సాహితీ పద్మ భూషణుడు" అనే కవితలో ఇంకొక కవి గళం ఎత్తాడు.

స్థానిక భాష కే పట్టం కట్టిన/ మహిమాన్విత విశ్వవిద్యాలయం/ సామాజిక ఉద్యమాల సెలిమ అంటూ "చదువుల ఉస్మానియా" కవిత లో పెందొట వెంకటేశ్వర్లు వివరించారు.

"మా తెలంగాణ తల్లికి నాలుగు కోట్ల వందనాలు/ మా బంగారు తల్లికి బంతి పూల దండలు" అంటూ "తెలంగాణ తల్లి" కవిత లో వీరులను కన్నా తెలంగాణ తల్లి గురించి వర్ణించారు.

తెలంగాణ కోసం ప్రాణాలు అర్పించిన "అమరులకు వందనాలు" కవిత లో అందు కోండి వంద నాలు అమరవీరుల అంటూ మరో కవి వందనాలు సమర్పించారు.

ఈ తెలంగాణ కవిత వైభవంలో ప్రతి కవిత తెలంగాణ గొప్పతనాన్ని, నేపథ్యాన్ని, వైభవాన్ని చాటి చెప్పేవే.

పుస్తకం ముఖ చిత్రం చాలా బాగుంది. తెలంగాణ తల్లి, తెలంగాణ చిత్రపటంతో అమరవీరుల స్మారక స్తూపం బోనాలతో ముఖచిత్రం ఆకర్షణీయంగా ఉంది.

-పుస్తక ప్రతులకు
శ్రీవాణి సాహిత్య పరిషత్తు
ఇంటి నెంబర్ 15 బి90
హనుమాన్ నగర్ సిద్దిపేట
9440524546

-యాదవరం
చంద్రకాంత్ గౌడ్
9441762105

అమాయకపు చూపులు

ఉహాలన్నీ కొండెక్కి కూర్చొని
గాలితో గుసగుసలాడుతున్నాయి.
మనసులో నిండిన దుఃఖమంతా..
మోసం చేసిన మనుషులను..
మదిలో నింపుకొని తూకం వేస్తున్నాయి.
కళ్ళన్నీ అమయాకపు చూపులను..
చూస్తూ కాలాన్ని నిలదీస్తున్నాయి.
జ్ఞాపకాలన్నీ
హృదయపు గదిలోని అల్మారాలో..
నిండుకొని భద్రంగా తాళం వేసుకున్నాయి.
ఆశలన్నీ మంచు తెరల్లా కళ్ళముందు...
తడిమిచూస్తే అంతా మాయే.
నిద్రిస్తున్న కళ్ళలో కలలన్నీ సంతోషాల..
పూలై పూస్తున్నాయి.
మెలుకువ వచ్చినవేల అదో భ్రమ.
ఏకాంతాన కూర్చొని ఉన్న చోట..
ఏవోకొన్ని ప్రేమ పలుకుల చప్పుళ్ళు.
చెవినిండా విందామంటే అంతా నిశ్శబ్దం.
గమ్యం దారిలో పయనిస్తూ ఉంటే..
ప్రమిధల కాంతులన్నీ కనిపిస్తూ ఉన్నా..
ఎదలో మాత్రం చీకటి మేఘాలు.

ఎన్నో బతుకులు ఒంటరి తీగలమీద..
తలకిందులై వ్రేలాడుతున్నాయి.
రెక్కల తెగిపడిన పక్షులన్నీ గాయాల గాణాన్ని..
ఆలపిస్తూ బతుకువేటని సాగిస్తున్నాయి.
అమాయకపు చూపులను చూస్తూ..
మంచి మనసులు అనే చెట్టుకుపూసే
మానవత్వపు మనుషుల పలకరింపు
కోసం ఎదురుచూస్తున్నాయి.

-అశోక్ గోనె
9441317361

కార్యసిద్ధికి మూడుమెట్లు

అడుగుడి
మీ కియ్యబడును...
వెదకుడి మీకు దొరకును...
తట్టుడి మీకు తీయబడును...
అన్నది బైబిల్ శుభసందేశం...

ఔను నిజమే
భయపడకుండా
సిగ్గు లజ్జ లేకుండా
ఆలస్యం చేయకుండా
అనుమానపడకుండా
మొహమాటమే లేకుండా

అడిగే...
ప్రతివానికి
అప్పు దొరుకుతుంది
ఆశ కోరిక ఆకలి
అవసరం తప్పక తీరుతుంది.

కొంత ఓపికతో
ఓర్పుతో నేర్పుతో
గట్టి నమ్మకంతో
వెదికే...
ప్రతివానికి ఎక్కడో దాచిన ఎవరికీ దొరకని
తరతరాలకు తరగని
కలలోనైనా ఊహించని
గుప్తనిధి ఒకటి దొరుకుతుంది
చేసే ప్రతిప్రయత్నం తప్పక ఫలిస్తుంది.

పగలు రేయి
నిద్ర మేల్కొని
పదేపదే అదేపనిగా
తలుపును "తడుతూ" వుంటే
సహనంతో "కొడుతూ" వుంటే
అది తప్పక తెరుచుకుంటుంది.

ఆపై మనస్ఫూర్తిగా ఆహ్వానం పలికితే
తడబడుతూ లోపలికి అడుగు పెడితే
ఎంతటి అద్భుతమైన అపూర్వమైన
ఆతిథ్యం దొరుకుతుందో ఎవరికెవరు ?

ఏ పనినైనా...ఏ గుప్తనిధినైనా...
ఏ ఆతిథ్యమైనా...మరే వరమైనా...
ప్రయత్నమే మనిషిది...
ఫలితం మాత్రం ఆ పరమాత్మది..

-పోలయ్య కూకట్లపల్లి
9110784502

పుస్తక సమీక్షలు

మా నాయన పాట

ఇటీవలే కవిత్వం రాస్తున్న చాలామంది కవుల్లో సుంకర గోపాలయ్య కవిత్వం చదవదగినది.. ఇందులో మొత్తము 52 కవితలు ఉన్నాయి. ప్రతి కవిత్వం దేని కవే ప్రత్యేకమైనవి. కొత్తగా కవిత్వం రాయా లని తపించేటువంటి కవులు మరియు కవిత్వం రాస్తున్నటువంటి వారు కూడా ఈ పుస్తకాన్ని చదివినట్లయితే కవిత్వ పరిమళాలు ఆస్వాదిస్తారు అనడంలో ఎలాంటి సందేహం లేదు. కవి తన చుట్టూ ఉన్న పరిసరాలలో జరుగుతున్నటువంటి అనేక సంఘటనల సమాహారాన్ని, మానవ సంబంధాలను సంక్షిప్త వచన రూపంలో భావాన్ని జోప్పించి పాఠకుడి హృదయాన్ని ఆకర్షించడంలో కవిత్వాన్ని ఒక ఆయుధంగా మలుచుకుంటున్నాడు అని చెప్పడానికి కవితాశైలిని, ఎంచుకున్న వస్తువును ఆధారంగా చెప్పవచ్చు. గోపాలయ్య కవిత్వం చదువుతున్నంత సేపు ఒక కొత్త అనుభూతికి లోనవుతాం.. సరళమైన పదాలతో గంభీరమైన భావర్థాన్ని వ్యక్తం చేయడంలో గోపాలయ్య కలం సాన తేలింది ..పుస్తకం తెరవగానే మనకు ముందుగా కనిపించే మొదటి కవిత"

ఖాళీ అయిన ఇల్లు" అనే శీర్షికతో ఉంటుంది.

ఇల్లు ఖాళీ అని తెలిస్తే చూడటానికి వెళ్ళాం అనే వాక్యంతో మొదలవుతూ

ప్రతి ఇంట్లోనూ ఒక మహాసముద్రం ఉంటుంది.

దాన్ని దాటడానికి పడవ లాంటి మనుషులు కావాలి" అని అంటాడు కవి.. ఈ కవితలో సంసారపు తాలూకు దుఃఖాన్ని ఆ ఇంట్లో ఉన్నటువంటి పరిసరాలను అద్భుతమైన ప్రతీకలతో సహజంగా రాయడం ఈ కవికి బలంగా చెప్పవచ్చు?.

"చీకటి.."

చీకటి గురించి, అంధకారాన్ని గురించి, నలుపు అందచందాల గురించి ప్రాచీన మొదలు ఆధునికం వరకు అనేకమంది కవులు వారి వారి ఆలోచన దృక్పథాలతో వర్ణిస్తూ వెళ్లారు అలాగే గోపాలయ్య గారు ఇక్కడ చీకటి యొక్క ప్రేమను విశ్వవ్యాప్తం చేస్తూ ఒక కొత్త కోణాన్ని ఆవిష్కరించారు.. చీకటి నల్ల సూర్యుడు నెల్సన్ మండేలా లాంటి అనేకమంది యోధులను తయారు చేసిందని అంటాడు

''చీకటి వాననీటిలా ఎంత స్వచ్ఛమైనదో " అంటాడు కవి

మరో సందర్భంలో "వెలుగుకి వివక్షత ఉంది చీకటి ప్రేమ విశ్వ వ్యాప్తం..'' అని ఘంటాపదంగా చెప్పాడు..

"నిర్మాణ విధ్వంసం"

ప్రపంచానికి అద్భుతమైన కళాఖండాలు నిర్మించినటువంటి శ్రామికులు వారి జీవితాలు చరిత్రలో నెత్తుటి ఆనవాళ్ళుగానే మిగిలిపోయాయని ఆవేదన వ్యక్తం చేస్తాడు కవి. ఈ క్రింది వాక్యాలను గమనిస్తే తెలుస్తుంది.

"అదిగో
బట్టికి ఇప్పుడే నిప్పంటించారు,
జీవితం కాలుతున్న పచ్చివాసన
ఎటు చూసినా నిర్మాణ విధ్వంసం
గడ్డలు కడుతున్న నెత్తుటి ఆనవాళు
.. శ్రామికులు వారి పిల్లల బాల్యము
ఈ నిర్మాణాలలో ఈజిప్టు మమ్మీల
సమాధి చేయబడుతున్నాయి అంటాడు
కవి.

"దుఃఖ లిపి"

మనుషులు ఆనందము దుఃఖము రెండు సమాంతర రేఖలు "దుఃఖం వచ్చినప్పుడు వచ్చేవి కన్నీరే" ఆనందంగా ఉన్నప్పుడు వచ్చేవి ఆనందభాష్పాల రూపంలో కన్నీరే. ఇక్కడ కవి ఈ దుక్కలిపిలో ఒక కొత్త నిర్వచనాన్ని ఇవ్వడం జరిగింది.

''కొబ్బరికాయ కొడితే నీళ్లు వచ్చినట్టు
గుండె పగిలితే కన్నీరే''

వస్తుందంటాడు.. కళ్ళు కాయలు కాయడం సహజమే కానీ కన్నీటిని పూలమాలగా ధరించే సందర్భాన్ని వర్ణించడం కొత్తగా అనిపిస్తుంది.

దుఃఖానికి భయపడితేకన్నీటి చెరువులో ముంచేస్తుంది.. అంటూ ధైర్యాన్ని నూరిపోస్తాడు కవి.

పారిశ్రామిక విప్లవానంతరం చోటుచేసుకున్న సామాజిక, ఆర్థిక, రాజకీయ పరిణామాలలో యంత్రాల ప్రాముఖ్యత మరువలేనిది ఇప్పుడు మనిషి ప్రతి పనికి యంత్రాల మీద ఆధారపడం సహజం. రోటి పచ్చడి శీర్షికన రాసినటువంటి ఈ కవిత.. రోకలికి ఉన్న మనిషితనం మిక్సీకి ఉండదేమో అంటాడు.. నిజానికి మనిషి ఆలోచన యాంత్రికమైపోతుంది అని రోకలి బండతో పచ్చడి నూరేటప్పుడు మనిషి తన మనసులోని భావాలను అనుబంధాలను పెన వేసుకుంటూ రుద్దడంతో ఆ పచ్చడి కమ్మని రుచిని ఆస్వాదిస్తామని చెప్తాడు .

"మా నాయన పాట..". తాగి వచ్చిన రాత్రి మా నాయన ఒక పాట పాడేవాడు అందులో పారే నీటి గొంతు ఉండేది అంటూ జీవన సారాన్ని ఎదుర్కొంటున్న సమస్యలను ఎలా ఎదుర్కోవాలో ఈ కవితలో చూపిస్తాడు ..

పర్యావరణ పరిరక్షణలో భాగంగా చెట్లను నరకడం అరికట్టాలనే ఉద్దేశంతో కూలిన శ్వాస అనే శీర్షికన వినూత్నమైన రీతిలో కవిత్వం వాక్యాలు నడుస్తాయి.

**"ఇప్పుడు
అక్కడ చెట్టు లేదు
వాస్తుకు విరుద్ధమని
హత్య చేయబడింది.."** మనిషి స్వార్థాన్ని ఒక్క వాక్యంలో చూపిస్తాడు.. చెట్టును దైవంతో పోల్చడం

పాఠకుడు కొత్త అనుభూతికి లోనైతాడు..

తన కవిత్వానికి వెంటనే చేరువవుతాడు..

"మళ్లీ ఇంట్లోకి"

ప్రపంచీకరణ ప్రభావంతో ప్రస్తుత తరుణంలో మనిషికి మనిషికి మధ్య దూరం చాలా పెరుగుతుందనీ, మనుషుల మధ్య విష బీజాలు నాటుకుంటున్నాయని అంటున్నాడు.

**"ఇల్లు కూలిపోయింది
ఇల్లు కూలడానికి తుఫానో,
భూకంపమో అక్కర్లేదు
పంట కాలువ లాంటి మనిషి
నరాల్లో
మార్కెట్ ప్రవహిస్తే చాలు...
మనిషి యాంత్రికరణకు లోనై
మానవత్వాన్ని మర్చిపోతున్నారని** గుర్తు చేస్తాడు..

మరో సందర్భంలో మరణానికి ఒక కొత్త నిర్వచనాన్ని సూచించాడు

**"రేపటినుండి
ఎవరి మరణం వారికి
ఎరుక లేకపోవడమే జీవితం.."**

జీవితానికి మరణానికి మధ్య సంబంధాన్ని రెండు వాక్యాలలో చెప్పడం గోపాలయ్య కవిత్వానికి ఉన్న బలం..

"ఎగిరి"

కవిత్వం పాఠకుడి గుండెల్లో చొరపడుతుంది అని చెప్పడానికి ఈ శీర్షికలో చెప్పాడు

**"పొద్దున్నే
పిట్టగోడ మీద
వద్యం వాలింది?.** రెక్కలు కట్టుకొని చెట్టు లాంటి కవి గుండెల్లోనే... చేరింది అంటాడు..

**"పక్కవారిని పలకరించే తీరిక లేని మనిషి
మనిషితనం అకౌంట్ క్లోజ్ చేసి
ఫేస్బుక్ లోను ట్విట్టర్ లోనో ఖాతా తెరిచి
నెట్ వీధుల్లో వ్యక్తిత్వాన్ని విసిరేసుకుంటాడు
ఒక మౌస్, సెల్ఫీను, రిమోటో
మనిషిని స్వాధీనం చేసుకుంటుంది" ..** అని మనిషిని మరమ్మతు చేసే ఒక పనిముట్టు కావాలని ముగిస్తాడు.. పునర్నిర్మాణ కవితలో?

"వీధులు"

చాలా ప్రాంతాలలో ప్రజలు పనులు లభించగా వలస పోవడం జరుగుతూ ఉంటుంది అలా వలస వెళ్లినటువంటి విధానాన్ని గ్రామాలలో మనుషులు కనపడకపోవడాన్ని వీధులు అనేటువంటి శీర్షికన గోపాలయ్య గారు వివరించడం జరిగింది..

"వీధులు"
**ఎలా ఉండేవి
మా చిన్నప్పటి వీధులు
చెప్పుల్లేని కాళ్లకు
ప్రేమ లేపనం రాసేవి** అంటాడు.

**"వీధులు ఇప్పుడు
తాళాలేసి వలస వెళ్లిన వారి
గూడుల్లా ఉన్నాయి.
ఒక్క మొక్క మొలకెత్తని
వ్యర్థ భూములా ఉన్నాయి..** అని,

**"పిల్లల మనసుల్ని టీవీనో, సెల్ ఫోనో
కట్టేసుకున్నాక
వీధులు ఎలా బ్రతికి ఉంటాయి?** అంటారు కవి?

"ఎడమ పాదం"

ఆధునిక ప్రపంచంలో సమాజంలోని పంట పొలాల స్థానంలో రియల్ ఎస్టేట్ వ్యాపారం ఎలా వ్యాప్తి చెందు తుందో? శీర్షికలో వివరిస్తారు..కవి

**"మా పల్లెల్లో
రియల్ ఎస్టేట్ ఎడమ పాదం
పెట్టాక
...
...
విత్తనాలు వేయకుండానే
భూమి డబ్బు పంటను విరగ పండించింది..** అని,

నల్లధనాన్ని దాచే పేటిక అవుతుందని .. భూమి ఎప్పటికైనా విలువైన వనరుగా సూచించారు..

కవి మరొక కవిత "మళ్లీ మనిషి కోసంఅనే శీర్షికన" అవును

ఇప్పుడు ఇక్కడ మనుషులు చంపబడతారు
చంపేస్తుంటారు

మనిషి మాయం కావడం, మామూలే.. అంటూ ప్రస్తుతం సమాజంలో జరుగుతున్నటువంటి హత్యలు దుర్మార్గాలను ఎండగడతాడు..

"జీవించడం" అనే శీర్షికన

**"వాళ్లు
ఎక్కడనుండి
గాలి వచ్చినట్టు నీరు
కదిలినట్టు
అలా వస్తారు
ఓ చెట్టు కింద గుంపుగా
చేరుతారు
మూడు రాళ్లు పెట్టి
ఆకలిని మండిస్తారు..**

అనడంలో ఎంత సహజత్వం ఉట్టిపడుతుందంటే చెట్ల కింద జీవనం కొనసాగించే కొన్ని సంచార తెగల కుటుంబాలను కవి చాలా దగ్గర నుండి పరిశీలన దృష్టితో చూసి రాసినట్టు ఈ కవిత కనిపిస్తూ ఉంటుంది.. ఇంకా ఇందులో అనేక కవిత్వాలు చదవదగినవి ఉన్నాయి.. గోపాలయ్య గారి కవిత్వం చాలా సరళ పదాలతోటి జీవితాన్ని రంగరించి పోసినట్లు ప్రతి వాక్యము, ప్రతి పదము మనసును హత్తుకుంటుంది.. ఈ పుస్తకము ఆద్యాంతం చదువుతున్నంత సేపు ఒక కొత్త కవిత్వ సాగరంలో ప్రతి ఒక్కరూ మునగాల్సిందే..! ఆణిముత్యాలు లాంటి కవిత్వాన్ని ఆస్వాదిం చాల్సిందే! కొత్తగా కవిత్వం రాయాలనే ఆలోచన ఉన్నటువంటి పాఠకులు, కవిత్వ ప్రేమికులు, కవిత్వం రాస్తున్నటు వంటి కవులు ఇంకా ఇతరులు ఈ పుస్తకాన్ని చదివినట్లయితే ఒక కొత్త కవిత్వానుభూతి పొందు తారనడంలో సంశయం ఏ మాత్రం లేదు..

-నాగరాజు మద్దెల
6301993211

పచ్చదనం

ఊపిరినిచ్చే ఉర్విని
పచ్చనిహారం వేసేద్దాం
పరపశించే ప్రకృతికి
మొక్కలను అంకితమిచ్చేద్దాం!

భగభగ మండే భానుడి సెగలకు
చల్లని తొడుగులు తొడిగేద్దాం
కణకణ లాడే కాంక్రీటుకు
మట్టిని ముద్దుగ అద్దేద్దాం!

ప్లాస్టిక్ మాని
బట్టనువాడే సంప్రదాయం పెంచేద్దాం
వ్యర్థాలను వాడి
కంపోస్ట్ ఎరువును సృష్టిద్దాం
రసాయనాలకు గుడ్ బాయ్ చెప్పి
సేంద్రియాలను ఆహ్వానిద్దాం!

చెట్లను పెంచి పుడమిని
కాలుష్యం తగ్గించి
వాతావరణాన్ని పరిరక్షిద్దా

మంజుల సూర్య 'కవన మంజరి'

పుస్తక సమీక్షలు

ఆమె పేరు మంజుల సూర్య. ఆమె కవిత్వం "కవన మంజరి". అందమైన కవిత్వం చెప్పాలని ఆమె ఆరాటం. అర్థవంతంగా రాయాలని ఆమె ప్రయత్నం. అందుకే **"దొరసానిలాగా దర్జాగ వచ్చేవు/ దొంగలా రక్తాన్ని దోచుకొని వెళ్ళేవు"** అని దోమతో కూడా ప్రేమగా మాట్లాడుతుంది. ఆమె దృష్టిలో ఆడపిల్ల అంటే అందాల బరిణ, అసామాన్య ప్రతిభ, చైతన్యపు ఝరి, మమకారపు మెరుపు. అమ్మ ఓదార్పు, నాన్న భరోసా. బాధ కలిగితే గుర్తొచ్చేది అమ్మ, ఆ బాధకు ఉపశమనం నాన్న. అమ్మ చెలిమైతే నాన్న చేయూత. పుస్తకమంటే ఆట, పాట, కథ, అనంతమైన జ్ఞానము, మానవ విలువలు పెంచే అపార సంపద. మనస్సు- అంతుచిక్కని రహస్యం, అర్థంకాని చిక్కు ప్రశ్న. ఆకారము లేకున్నా ఆటలాడిస్తుంది. కోపాన్ని **"కన్నుల్లో ఎరుపుదనం, మాటల్లో చురుకుదనం, ముఖమంతా కరుకుదనం, వదనమే వికారం"** అని నిర్వచిస్తుంది. జడ గురించి - **"నీలవేణి హొయలు కవితాధారకు ప్రేరణలు / ఆ ముంగురుల సొబగులు మదిలో గుబులు రేపే ప్రేమ ఝురులు... ముడివేస్తే ముచ్చటగా ఒదిగి కూర్చుండేను / వదిలేస్తే విహంగ ములా స్వేచ్ఛగా ఎగిరేను/ మూడు పాయల చిలికలు - త్రివేణి సంగమంలా కదులు''** అని కవిత్వీకరిస్తుంది.

పి.వి. నరసింహారావును **"భారతావని రీవి - మన పీవి / గర్జించని సింహం - ఈ నరసిం హం... బహుభాషలు నాలుకపై నాట్యమాడుతున్నా / మౌనాన్ని ఆశ్రయించిన సిద్ధయోగి"** అని కొనియాడుతుంది. తెలంగాణ గురించి **"తీయతేనియ సోన నా తెలంగాణ / తేట తెలుగుల వీణ నా తెలంగాణ''** అని గానం చేస్తుంది. **"ఇంద్ర ధనసు రంగులన్నీ ఇలలోన ఇమిడి ఉండే"** హోళీని, మూలాల్ని మరువకు, దారాన్ని వదలకు అని చాటే ఎగసిపడే పతంగులను ప్రస్తావిస్తుంది. షడ్రుచులతో ఉగాది సందేశాన్ని, ఆరోగ్య రహస్యాలను అందిస్తుంది. కళ్ల గురించి కమనీయ కవిత రాస్తుంది. 'నిను చూడగానే' కవిత మధురమైన ప్రేమగీతం. ఇక కరోనాకు జీవితానికి ముడిపెట్టి ఈ కవయిత్రి అందించింది పరమార్థం. చందమామతో **"మేఘాల గుర్రంపై మిరుమిట్లు గొలిపేవు / అలసిపోయిన జీవుడికి కలల కౌగిలినిచ్చేవు / పెరిగేవు తరిగేవు రోజురోజుకీ మారేవు/ మార్పే సహజమని బహుచక్కగ చెప్పేవు"** అని అంటుంది.

ఈ రచయిత్రి అందాలను, ఆనందాలను అన్వేషించడమే కాదు. సమాజంలోని మరో కోణాన్నీ చూస్తుంది. అలజడులను, ఆవేదనలను గమనిస్తుంది. **"టెక్నాలజీ ఈజీ అయ్యే / బ్రతుకేమో బిజీ అయ్యే / గాడితప్పి గజిబిజయ్యే / ప్రగతి యేమో సున్నా అయ్యే"** అని వాస్తవాన్ని తెలియజేస్తుంది. స్త్రీ జీవితమే ఒక పోరాటం. **"ఆమె జననమొక సమరం / బాల్యమొక బంధనం / పెళ్లి ఒక పోరాటం". "నిప్పుల దారే ఆమె నడక / సుగంధ పుష్పాన్ని కర్కశంగా నలిపినా / సువాసనే వెదజల్లినట్లు / అంతరంగం అగ్నిజ్వాల అయినా / లావాను కాక లాలించే గుణాన్ని చూపడం / ఆమె సౌజన్యం"** అని ఆమె త్యాగాన్ని తెలియజేస్తుంది. **"తాను సృష్టించిన సమాజంలో తనకే రక్షణ కరువా?''** అని కవయిత్రి వేసే ప్రశ్నకు సమాజం సమాధానం చెప్పాలి. **"మనుషుల అనుబంధాలన్నీ మనీ వర్సు అయిపోయె / ప్రేమ లేదు, శాంతి లేదు, జీవం లేని జీవితం చేదు"** నేడు మన జీవితంలో జీవం ఉందా అని ప్రతి మనిషీ ప్రశ్నించుకోవాలి. "సంతులనంగా సంతసంగా మురిసిపోతున్న ప్రకృతిని చింపిరి విస్తరి చేస్తివి". ప్రకృతి ఊరుకుంటుందా? అని సూటిగా ప్రశ్నిస్తుంది. **"ఇప్పుడైనా మారితే మంచి మనిషి వవుతావు / లేదంటే మాడి మసి అవుతావు".** నీ పశు ప్రవృత్తే యమపాశమై నీ మెడకు ఉరితాడులా చుట్టుకుంటుందని ఘాటుగా హెచ్చరిస్తుంది.

మనిషి జీవితం సార్థకం కావాలి. అందుకే **"వెలుగుతున్న సూర్యుడిలా / చీకట్లో చిరుదివ్వెలా / గలగల పారే సెలయేరులా / నవ్వుతూ నవ్విస్తూ / ప్రవాహమై సాగిపో... ఇలలో ఒక పదిలమైన జ్ఞాపకంగా మిగిలిపో''** అని మంజుల సూర్య ఇచ్చే మహత్తర సందేశం. మంజుల సూర్య - కవిత్వంలో ఇంకా ఎదగాలని, పాఠకుల గుండెగూటిలో ఒదిగే కవిత్వాన్ని రాయాలని ఆశిస్తూ, అభినందిస్తున్నాను.

ప్రతులకు :
మంజుల సూర్య
9848787284

-ఎ. గజేందర్ రెడ్డి
9848894086

హనుమాన్ మొగ్గలు



శ్రవణం, కీర్తనం, విష్ణోస్మరణం, పాదసేవనమ్
అర్చనం, వందనం, దాస్యం, సఖ్యమాత్మ నివేదనమ్"

నవవిధ భక్తిమార్గాల ద్వారా భగవంతుని ఆరాధిస్తూ ఆధ్యాత్మిక, ఆత్మానందాన్ని, కైవల్యాన్ని సైతం పొంద వచ్చునని శ్రీమద్భాగవతంలో చెప్పబడింది. భావితరాల సంప్రదాయ పరిరక్షణ కోసం, భగవంతుని స్తుతిస్తూ ఎందరో కవులు, పండితులు, రచయితలు భక్తిరచనలు చేశారు. ఆ రచనలన్నీ సభక్తిపూర్వకంగా విరాజిల్లుతున్నవి. స్తోత్ర, శతక, గేయ మొదలైన ప్రక్రియల్లో భక్తి రచనలు చేసిన వారున్నారు. ఆధునిక కాలంలో వచన కవితా ప్రక్రియ కూడా కొత్త పుంతలు తొక్కుతున్నది. వినూత్న మార్పులను సంతరించు కుంటున్నది. వాటిలో 'మొగ్గలు' కవితా ప్రక్రియ ఒకటి. అల్పాక్షరముల అనల్పార్థ రచన అన్నట్లు ఈ ప్రక్రియలో అనేకులు రచనలు చేస్తున్నారు. పాలమూరు జిల్లాకు చెందిన డా. భీంపల్లి శ్రీకాంత్ ఈ 'మొగ్గలు' కవితా ప్రక్రియ సృష్టికర్త. మూడు పాదాలలో ఒదిగిన ముచ్చటైన కవితా రూపం మొగ్గలు. గోస్వామి 'తులసీదాస్' రచించిన "హను మాన్ చాలీసా" నుకాటేగారి పాండురంగ విఠల్ 'మొగ్గలు' కవితా ప్రక్రియలో రచించారు. వీరి అనువాదం సులభశైలిలో మనోహరంగా సాగింది. ఇందులో మూలంతో పాటు అనువాదం ఇవ్వడం విశేషం.

శ్రీరామ భక్తాగ్రేసరుడు హనుమంతుడు. అంజని తనయుడు. వాయుపుత్రుడు. శ్రీరామభక్తునిగా, నీతారాముల పాదదాసునిగా, నమ్మినబంటుగా, సాధుజన రక్షకుడిగా, విజయాన్ని అందించేవాడుగా, హనుమంతుడు కీర్తింపబడుతున్నాడు. ఆంజనేయుడు, హనుమంతుడు, కపివీరుడు, మారుతి మొదలైన పేర్లతో పిలువబడుతున్న హనుమం తుడు హిందువుల చేత మాత్రమే కాక అశేష జనావళి చేత భక్తిశ్రద్ధల తో పూజింపబడుతున్న దైవం. భూత, పిశాచాది గ్రహబాధలు లేకుండా రక్షిస్తాడని భక్తుల నమ్మకం. అందుకే హనుమంతుని ఆలయం లేని గ్రామం మన దేశంలో లేదు. పరమభక్తుడైన తులసీదాస్ హనుమ దర్శనానంతరం వ్రాసినది హను మాన్ చాలీసా. ఆపదలు, కష్టాలు, భయంతో బాధపడే వారు హను మాన్ చాలీసాను పఠించి సుఖ సంతోషాలను పొందుతూ ఉంటారని ప్రసిద్ధి.

''అతులిత బలధామం స్వర్ణ శైలాభదేహం'' అనే ఐదు స్తుతి శ్లోకాలను శ్రీ హనుమాన్ చాలీసా అనువాద ప్రారంభానికి మునుపే అందించారు కవి. మానవులు పురుషార్థాలను పొందాలన్నా, శ్రీరాముని అనుగ్రహం పొందాలన్నా రామభక్తుడైన హనుమ ఆశీర్వాదం అతిముఖ్యమైనది. గురువైన హనుమ అనుగ్రహం ఉంటే శ్రీరామదర్శనం సులభమౌతుందని, మారుతియే సకల శుభదాయకుడని ఈ మొగ్గలో తెలిపాడు.

'శ్రీగురుచరణ నరోజ రజ నిజమన ముకుర సుధారి
వరణౌ రఘువర విమల యశ జో దాయక ఫలచారి'
'గురుచరణములకు మ్రొక్కి పాదధూళి ధరించితే
పురుషార్థములు పొంది రఘురాముని పొందెదను
రామభక్త హనుమానుడు సకల శుభప్రదాయకుడు'

శ్రీరాముని దూతగా వారధి లంఘించి, లంకను చేరి సీతను దర్శించి, శ్రీ రాముని కుశలాన్ని సీతకు తెలిపాడు మారుతి. ఆ తల్లి సంతోషానికి కారకుడైనాడు. 'అష్ట సిద్ధులు' నీ వల్లనే కల్గుతాయని సీతామాత ఆనాడే వరమిచ్చింది. ఆవిధంగా భక్తజనుల వరప్రదాతగా హనుమను ఈ మొగ్గలో ప్రశంసిం చాడు కవి.

అష్టసిద్ధి నవనిధికే దాతా
అసవరదీన జానకీ మాతా
అష్టసిద్ధులు నవనిధులు మాకిచ్చి జానకీమాత దీవెనలందుకున్నావు
భక్తజన వరదాత ఆంజనేయుడు
అరివీర భయంకరుడు హనుమ,

ఆబాలగోపాలురంతా భజరంగబలి అంటు పొగడుతారు. భూత, పిశాచాలను అణిచివేసేవాడు హనుమ. ఎన్ని కష్టనష్టాలు ఎదురైనా మారుతిని స్మరిస్తే చాలు అవన్నీ దురమౌతాయని ఈ మొగ్గ తెలుపుతుంది.

సంకట కటై మిటై సబ పీరా
జో సుమిరై హనుమత బలబీరా
బలవీర హనుమంతుడిని స్మరిస్తే
పీడ సంకటములన్ని నశించును
సుఖమును ప్రసాదించును మారుతి

నిరంతర రామనామ స్మరణతో, ఎల్లవేళలా భక్తులను కాపాడేవాడు ఆంజనేయుడు. తన హృదయంలో శ్రీరామనామమును నిలుపుకున్నవాడు. చిరంజీవిగా కీర్తింపబడినవాడు. బాధలు తొలగించే బంధువై, నమ్మి కొలిచిన వారి హృదయాల్లో నిలిచి ఉండాలని కోరుకున్నాడు కవి.

పవన తనయ సంకట హరణ మంగళమూరతి రూప్
రామలఖన సీతాసహిత హృదయ బసవు సురభూప్
కష్ట సంకటములు తొలగించు మంగళమూర్తివై
రామలక్ష్మణసీతలతో నా హృదిలో వసించుము
పవనతనయా వాయునంద నుడా హనుమంతా!

హనుమాన్ చాలీసాతో పాటు హనుమాన్ దండకాన్ని, హనుమాన్ అష్టోత్తర శతనామావళిని భకుల సౌక ర్యార్థం ఈ చిరుపుస్తకంలో పొందు పరిచారు. చేతిలో ఇమిడిపోయే ఈ పుస్తకం భక్తులను అలరించడమే కాక, మొగ్గల కవితా ప్రియులను ఆకట్టుకుం టుందనడంలో సందేహం లేదు.

-ప్రతులకు:
డాక్టర్ భీంపల్లి శ్రీకాంత్,
ఇ.నం. 8-5-38,
టీచర్స్ కాలనీ,
మహబూబ్ నగర్ - 509001)

-అంబటి భానుప్రకాశ్
9948948787

సర్వ జనాదరణ ప్రక్రియ శతకం

సామాన్య ప్రజలు కూడా చదివి అర్థం చేసుకోవడానికి వీలుగా ఉన్నవి శతకాలు. పద్యాల ద్వారా సమాజానికి నీతిని బోధించి జ్ఞానాన్ని వికసింప చేయవచ్చని నిరూపించాయి శతక పద్యాలు .సమాజ హితం కోరి చేశారు సమాజ హితాన్ని కోరి కవులు శతక రచన చేశారు. సమాజ పరిస్థితులను తెలుపుతూ, మానవులలో నైతిక విలువలు పెంపొందించేందుకు కృషి చేశారు నాటి నుండి నేటి దాకా సమాజ గమనం కు వెలుగు దివ్వెలు ఈ శతకాలే.

సంఖ్యా నియమం, మకుట నియమం , చందోనియమం కలిగి ఆత్మాశ్రయ కవిత ధర్మాన్ని కలిగి ఉన్న పద్య రచన శతకం. శతకం అంటే "నూరు పద్యాలు" గలది అని అర్థం .అయితే కొన్ని శతకాలు మాత్రం నూరు పద్యాలకు మించి , ప్రస్తుతం 108 వరకు పద్యాలు ఉన్నాయి . భర్తృహరి సుభాషితాలు సంస్కృతంలో వందకు పైనే పద్యాలున్నాయి . ఇంకా వీటిలో ముఖ్యంగా భక్తి శతకాలు చెప్పుకోవాలి. భగవన్నామ నామస్తోత్రాలు అన్నీ దాదాపు సహస్రనీగానో, అష్టోత్తర శతకనీ గానో ఉండడం వల్ల భగవన్నుతి ప్రధానమైన శత కాలు కూడా అష్టోత్తరశతకంగానే ఉండాలి అనే సంప్రదాయం ఏర్పడింది.

సామాన్య ప్రజలు కూడా చదివి అర్థం చేసుకోవడానికి వీలుగా ఉన్నవి శతకాలు

జీవిత పాఠాలు నేర్పే వేమన శతకం, నీతి పద్యాలు సుమతి శతకం, లోకజ్ఞానం చెప్పే భాస్కర శతకం, కుమారి, కుమార శతకం, శ్రీకృష్ణ శతకం ఇలా తెలుగు వారికి సుపరిచితమే అయిన పద్యాలు ఉన్నాయి . ప్రతి పద్యం ఒక లక్ష్యంతో ఉంది. వందల పద్యాలు తెలుగు నేలలో వ్యాప్తిలో ఉన్నాయి. ఒకప్పుడు చదువులకు కొలమానంగా పద్యాలు పాడటం ఉండేది కానీ, నేడది కరువైంది. ప్రాథమిక తరగతుల నుండి పదవ తరగతి తెలుగు పాఠ్య పుస్తకాలలో "నీతి పద్యాలు"ఉన్నాయి.

శతకాలు వేటికవే స్వయం సంపూర్ణ, భావ ప్రధానాలు కావడంవల్ల కవి ఆత్మానుభూతికి నిలయమయ్యాయి. శతక ప్రక్రియ సర్వజన ఆదరణ పొందడంతో సాహితీ ప్రక్రియల్లో ప్రముఖ ప్రక్రియల్లో ఒకటిగా పేరు పొందింది. తెలుగు సాహిత్యంలో పండితారాధ్యుడు "శివతత్వసారం" తో శతక రచనకు శ్రీకారం చుట్టిన, అప్పటికీ శతక రచన కుండవలసిన లక్షణాలు కలిగి ఉన్న శతకము పాల్కురికి సోమనాథుడు రచించిన "వృషాధిప శతకము".

తర్వాత ఎన్నో శతకాలు రచించబడ్డాయి . వాటినన్నింటినీ నీతి శతకాలు అని, భక్తి శతకాలు, గా విభజించడం జరిగింది. నైతిక విలువలు పెంపొందించే ఉద్దేశంతో భక్తి శతకాలు, నీతి శతకాలు ఎక్కువగా రావడం జరిగింది. శతక పద్యాలు జీవితంలో నైతిక విలువలు ప్రాధాన్యం అని చెప్పడమే కాకుండా నీతి నియమాలు పాటించటం ప్రత్యేకత.

సాధారణంగా కావ్యాలు, సాహిత్య ప్రక్రియలు పండితులకు, మాత్రమే పరిమితమైనవి గా ఉంటాయి. విద్వంసులకు మాత్రమే అర్థమయ్యే విధంగా ఉండేవి. శతకాలు మాత్రం సామాన్య ప్రజలలో విశేష ఆదరణ పొం దాయి . ఇలా తెలుగు సాహిత్యం సామాన్యునికి పండితునికి మధ్య వారధిగా నిలిచింది.

శతక సాహిత్యానికి ఒక గొప్ప గుణం ఏమంటే ,జీవితాన్ని ,బతకాల్సిన విధానాన్ని చక్కగా ,వ్యవహారిక భాషలో తెలియజేయడం.రచయితల ముందుచూపు ఎంత గొప్పదంటే శతకాలులో చెప్పిన విషయాలు, నీతి సూత్రాలు అన్ని కాలాలకు వర్తించే విధంగా ఉంటాయి. అందుకే శతక ప్రక్రియ సర్వ జనాధరణ ప్రక్రియ

-యాదవరం
చంద్ర కాంత్ గౌడ్
9441762105

గజల్ ముషాయిరా

అసహాయిని ఓడిస్తే గెలుపేనని అనగలమా
అపరాధిని నిందిస్తే తప్పేనని అనగలమా.
కులంపేర ఏవేవో కుట్రలేన్నో జరుగుతున్న
కనులుమూసి కూర్చుందుట మాయేనని అనగలమా.
చీకటిలో మొలచినట్టి తారలకే వెలుగెక్కువ
వెలుగుతున్న తారలవీ మెరుపేనని అనగలమా.
చిత్తశుద్ధి లేకుంటే చిగురించవు ఆశలెపుడు
చిగురించని ఆశలకిక దిగులేనని అనగలమా.
అబద్ధాల మాటలతో అందరినీ నమ్మించీ
అందమైన జీవితమూ హాయేనని అనగలమా
తెల్లగున్న వస్త్రాలకు తేజమెంత ఉంటుందో
తెలుపురంగు నరునిగుణం తెలుపేనని అనగలమా
వానచినుకు రాలితేనె వసుధపచ్చ బడుతుందీ
పరుచుకున్న మేఘాలది ప్రతిభేనని అనగలమా
రాజిలేని బతుకెందుకు రాజ్యమందు పరమేశా
రాజుకున్న నిప్పుకనిక వెలుగేనని అనగలమా.

-గణపురం పరమేశ్వర్
7013333911

కష్టం విలువ

(కథ)

రాజగోపాల్‌పేట అనే ఊరిలో భరత్ అనే ఒక వ్యక్తి ఉండేవాడు. అతడు ఒక బట్టల దుకాణం పెట్టి తన కుటుంబాన్ని నడిపిస్తున్నాడు .అతని భార్య పేరు లక్ష్మి. అతనికి ఇద్దరు కొడుకులు ఉన్నారు. వారు రాజు మరియు ప్రశాంత్. రాజు పెద్దవాడు. అతను ఎప్పుడు డబ్బులు వృధాగా ఖర్చు చేస్తుంటాడు. చదువు రాదు, ఆటలు ఆడడు, ఎప్పుడు దోస్తులతో తిరుగుతుంటాడు. బడికి సరిగా వెళ్ళేవాడు కాదు.

ప్రశాంత్ ఇంట్లో కూర్చుని చదువుకుంటాడు. సాయంత్రం ఆడుకుంటాడు .ఇంట్లో ఏమైన పని చెప్తే తప్పక చేస్తాడు. రోజు భరత్ రాజుని పిలిచి అతడికి పది రూపాయిలు ఇచ్చి వాటిని ప్రశాంత్‌కి ఇవ్వమంటాడు. రాజు ఏమి ఆలోచించకుండా డబ్బులు ప్రశాంత్‌కి ఇచ్చేస్తాడు. మరో రోజు భరత్ రాజుని పిలిచి 5 రూపాయిలు ఇచ్చి వాటిని చింపమంటాడు.రాజు చింపేస్తాడు .

భరత్ రాజుని "నువ్వు ఇప్పుడు డబ్బులు ఎందుకు చింపావు ?" అడుగుతాడు .

"మీరే చింపమన్నారు కద నాన్న" అని అన్నాడు రాజు

"నేను చింపమని అంటే ఎన్ని రూపాయలైనా చింపుతావా"అని అడిగాడు .

"మీరు చింపమంటే చింపుతాను" అని మూర్ఖంగా అన్నాడు రాజు .

"నీకు అసలు డబ్బు విలువనే తెలియదు. నీ అంతట నువ్వు సంపాదించి దాన్ని ఖర్చు చేసుకో" అని కోపంగా భరత్ చెప్పాడు.

మరుసటి రోజు ప్రొద్దున రాజు లేచి నాన్న చెప్పిందాన్ని గురించి ఆలోచించాడు. అతడికి సిగ్గు అనిపించింది . ఎలాగైనా తన స్వంతగా డబ్బు సంపాదించాలని అనుకున్నాడు.

అప్పుడు వేసవి కాలం సెలవులు కాబట్టి అతడు పని కోసం బజారుకు వెళ్లి చాలా మందిని పని అడిగాడు. ఎవ్వరు పని ఇవ్వలేదు. చివరికి ఒక కిరాణం దుకాణంలోకి వెళ్ళి అడిగాడు రాజు. దుకాణం యజమాని పని ఇచ్చాడు. అక్కడ పనికి నెలకు వెయ్యి రూపాయలు. రెండు పూటలు తింది. ప్రొదున 6 గంటల నుండి సాయంత్రం 7 గంటల వరకు పని చేయాలి. రాజు మరుసటి రోజు నుండి పనిలోకి వెళ్ళాడు.

అలా ఒక నెల గడిచింది.రాజుకు మొదటి నెల జీతం వచ్చింది.ఆ డబ్బులు తీసుకెళ్ళి భరత్ కు ఇచ్చాడు.

"నన్ను క్షమించండి నాన్న, నాకు అప్పుడు డబ్బు విలువ తెలియదు.మీరు ఎంత కష్టపడితే డబ్బులు వస్తున్నాయో నాకుఇప్పుడు అర్థమైంది. ఇంకెప్పుడు డబ్బు వృధాగా ఖర్చు చేయను"వినయంగా అన్నాడు రాజు.

"నీకు కష్టం విలువ తెలిసింది. డబ్బు కంటే చదువు గొప్పది. ఇక నుండి మంచిగా చదువుకోవాలి" భరత్ రాజుని మెచ్చుకున్నాడు. రాజు పని మానేసి బడికి వెళ్ళాడు.

-తాటిపల్లి భువనేశ్
ఏడవ తరగతి, జక్కాపూర్ ఉన్నత పాఠశాల
సిద్దిపేట జిల్లా
9959007914

ఆమె లేక అతడు లేడు!

ఆమె అనూహ్య - అపురూప -ఆరాధ్య అలివేణి ..పూబోణి ఆమె సంపంగి సోకు. - మొగలి రేకు - మల్లెల కాక -వెన్నెల వాక .ఆమె మరువపు మొలక - పంచవన్నెల చిలక ఆమె ఒక వర్ణం - వర్ణన. ఆమె ఒక పూలకొమ్మ - పసుపు కొమ్ము. ఆమె రసజ్ఞి-ప్రజ్ఞ ..... సర్వజ్ఞ. ఆమె చాకచక్యపు మెరుపు - భాదల మౌనమౌ అరుపు. ఆమె చెప్పేవి ఋక్కులు- చేసేవి యుద్ధాలు. ఆమె బాధల సుడిగుండం - స్నేహరహిత అగ్నిగుండం. ఆమె ఒక ఆకర్షణ - ఒక కుతూహలం -ఒక రహస్యం -రసోదయం. ఒక విషాదం. ఒక సంతసం.ఆమె ఒకరికి ప్రేయసి - ఒకరికి ఊర్వసి - ఒకరికి చిట్టి - ఒకరికి ఎంకి - మరొకరికి ప్రేమసారణి . రస రాగిణి.ఆమె ఒక్కొక్కరికి ఒక్కోరా ..

ఆమె చెలిమైతే అమృతం
కలిమైతే అదృష్టం.
బలమైతే అనురాగం.
అలాంటి ఆమె -
"ఎద చూపితే లోకం ఆర్నెల్ల పసిపాప,
ఆమె ద్వేషిస్తే లోకం రావణ కాష్ఠం" - అని అన్నారు. సి.నా.రె వెన్నెల పాయలాంటి ప్రేమ ఆమె ఎద నున్న లాలస ఆమె సొంతమే . కలత - కోపం - కన్నీళ్ళు - కపటం- కారిన్యం ఆమెను కాటేస్తే ఆమె రుద్రాణి.

ఆమె తోనే తన ఉనికి - సుఖం అనుకునే వారు ,అంతగా ఆమెను గౌరవించి, ప్రేమించే వారు ఉంటారు..

ప్రాణమిస్తారు. (ఆమె)

" నీవు లేని చోట నాకు చోటు లేదు.
సుఖం లేదు.
లేదు ఉనికి" అనే తిలక్ లాంటి వారెంత మందో ఉంటారు. 'ఆమె'కు విలువనిచ్చే వారుంటారు. ఆమే తన గీతం భావం బతుకు అని తలచే వ్యక్తి...ఆమెను ప్రియే... ప్రియే అని పిలుచుకునే వ్యక్తి

"ప్రియే లేక మధువు సేవించ గలనా
ప్రియే లేక క్షణమైన
జీవించేలా
ప్రియే లేక బతుకు
భావించగలనా ఆమే లేని గీతం ఊహించగలనా"... అని మదనపడతాడు శేషేంద్ర.ఇంకా...

నీవే (ఆమే) లేకపోతే
ఆకాశం మాత్రం
ఏమవుతుంది
సూర్యచంద్రులు..
పర్వతాలు. కలసిన
శూన్యం కాక" అని అంటారు.

నిజమే మరి. ఎవరి జీవితంలో నైనా

" ఆమె" ఉంటేనేగా అతడు....
భావుకత
నిండి సార్థకత చెంది
సాఫల్యత పొందేది
ఆమె అనిన నాకు అధికాను రాగమ్ము...

అంటాడు గాలిబ్.

నిజమే..తనదైన ఆమె పట్ల ఆ అధికానురాగం
చూపకపోతే ఎలా? మనసు సాంత్వన పొందేదెలా?
"నిన్నటి దాకా ఆమె ఎవరో తెలియదు
ఇవాళ ఆవిడే సర్వస్వం
గొప్ప అనుభవం స్త్రీ" అంటారు సుగంబాబు.

అసలు పరిచయమే లేని ఆమె ఊహలో చొరబడి తలపుల లోచనాల ముందామె సాక్షాత్కరించి ఒక్కసారిగా నిజ జీవితంలో ఎదురుపడితే ఆమే సర్వస్వమౌతుంది.

గృహమనే స్వర్గ సీమలో -

"ఆమె నవనీత హృదయ నా యంతరంగ శాంతి దేవత ఆశా పథాంతరాన పారిజాతము ప్రేమ జీవన విధాత
కైశికీ రీతి నా తపః కల్పవల్లి" - అని వేగుల సత్యనారాయణ గారన్నట్లు ఎంతమంది అలా ఆరాధించగలరు

తన ఊహలలో, ఆలోచనలలో, వలపులో, భావనలో అతడు ఆమెను ఏమని వర్ణిస్తాడో... ఆమె గురించి ఎలాంటి భావుకతను ప్రదర్శిస్తాడో ...ఆమె మనసునెలా చదువుతాడో ఆమెనెలా అర్థం చేసుకుంటాడో...అనే ఆలోచన మనలో తొంగి చూస్తుంది కదా

"ఆమె కేశములు సౌందర్య ఖనులు
వెలసినవి నేడు నన్నురిపెట్టు కొరకు" - అని అంటాడు గాలిబ్, నిడుపాటి కురులే నిజమైన సౌందర్యం ఆమెకు. అయితే ఆ సౌందర్యం

> **"నా కంటి పాపలో నిదురపోరా నీ వెంట లోకాలు గెలువనీరా" అంటూ ప్రతి క్షణం ఆమె తన చెలుని వెన్నంటి ఉండాలనే కోరుకుంటుంది. అలాంటప్పుడు ఆమె ఆకాశంలో సగం ఎందుకు అవుతుంది"**

భిన్నమైతే ఆ సౌందార్యాన్నంతా ఆస్వాదించటం సాధ్యమేనా.. అందుకే నిడుపాటి కురులున్నందకేనేమో **''సొగసుకీల్జడ దాస''** అంటూ **"శ్రీనాథుడు వర్ణించాడు. ఆమె కనులు నిశ్శబ్దమ్ములయ్యు పలుకు''** అని అంటాడు గాలిబ్ కనులకెన్ని పలుకుల తళుకులో ఆ రేఖాంజనముల ఎన్ని భావవీచికలో - చదువగలనేర్పుండాలి కదా ఎదటి వారిలో అయితే నేనున్నానంటూ కృష్ణశాస్త్రి తెలిపారు. ఆమె కనులలోని భావ వీచికలను - తలపులను -

"ఆమె కనులలో ననంతాంబరపు
నీలి నీడలు కలవు
వినిర్మలాంబువూర గంభీర శాంత కాసార చిత్ర హృదయములోని గాటంపు నిదుర ఛాయ
లందు నెడనెడ గ్రమ్ము సంధ్యా వసాన
సమయమున సీసపాద శాఖిగాగ్ర
పత్రకుటిల మార్గముల
లోపల వసించు
ఇరుల గుసగుసల్ వానిలోనిపుడు నపుడు
వినబడుచునుండు
మతికొన్ని వేళలందు వానకారు మబ్బుల మెయివన్నె వెనుకదాగు బాష్పమ్ములామె నేత్రములలోన బొందుచుండునుఎదియొ అపూర్వ మధుర రక్తి స్ఫురియించుగాని అర్థమ్ముకాని భావగీతమ్ములవి..... '' అంటూ 'ఆమె' కనులలోని భావాలను వివరించారు. ఆమె కనులలో మరి ఇలా ఎన్ని భావాలో.... ఇంతకీ ఆయన ఇన్ని భావాల్ని ఎలా తలచగలిగారంటే 'ఆమె' ఆయన ఊర్వశి

"ఊర్వశీ! ప్రేయసీ
నేడో యుష్మదీయ
చరణమసృణారుణోదయ సురబి కాంతి
పలుకరించున, సోకునా, తళుకుమనున
ఆరని వెలుంగె నీగీతి కాంతిక ముల
జేర్చికొని, కూర్చికొని భవచ్చీవిలా సహాస వాసనావేశములందికొనగ
రమ్య హిమవాలుకాచ్ఛ నీరాజన ముగ ఈయనా నా సఖీ! ''-అని ఆమెపై ప్రేమామృతాన్ని కురిపించారు

"నీవు అందాల తుఫానువి
చీరా తారా కలిపి నేసిన రూపానివి
నీ చేతులు పూవుల దండలునీ నవ్వు నక్షత్రాల కండలు" అంటూ ఆమె వ్యక్తిత్వాన్ని, అందాన్ని కూడా ఉపమానాలతో ఉటంకించారు శేషేంద్ర

ఇంకా -

"ఆమె నడక ప్రోజు పొయెం
ఆమెకంటో మారినావా నయం
ఆమె పొడుగు పొగడ వృక్షం" అంటూ ఆమె నడక హొయలును, ఆకార సౌష్ఠవాన్ని ఇచ్చే నిషాని తెలిపారు.

ఎంకి - ఈమాట అనుకోగానే పోతపోసిన అందం అమాయకత్వం అసలుసిసలైన ప్రేమ
మనకళ్ళముందు కదలాడుతుంది.
ఆ ఎంకి గురించి నాయుడు బావ -

"యెంకివంటి పిల్ల లేదోయ్
లేదోయ్యెంకి నావొంకింక రాదోయ్
రాదోయ్మెళ్ళో పూసల పేరు
తల్లో పూవుల సేరు
కళ్ళెత్తితే చాలు కనకాభిషేకాలు"-
సెక్కిట చిన్న మచ్చ సాపితే పొందు లచ్చ
ఒక్క నవ్వేయేలు వజరవయి దూరాలు-
పదమూ పాడిందంటె పాపాలు పోవాలకతలూ సెప్పిందంటె కలకాలముండాల-
రాసోరింటికైన రంగు తెచ్చే పిల్లనా సొమ్ము నా గుండె నమిలి మింగిన పిల్ల" అంటూ నండూరి సుబ్బారావు

ఆమె అందాన్ని, శక్తిని, ఆమె వల్ల తను పొందే తృప్తిని, నమ్మకాన్ని, హద్దులు లేని ప్రేమని, పల్లెటూరి ముగ్ధత్వాన్ని నిజాయితీగా చెప్పాడు ఆమె స్థానం జీవితంలో ఎంత ఉంటుందో తెలిపారు.

కరుణశ్రీ తన ప్రణయిని ఐన ఆమె గురించి..
దయగల దేవదేవుడు
గదా కరుణించెను నాకు " శ్రీ శుభోదయ"
వగు నిన్ను "సుందర మధురాధర గోస్తనీ రస ప్రియవగు నిన్ను
" శాంతి సమపేత సముజ్వల సాహితీసమాశ్రయ వగు నిన్ను నా వలపు జంటగ నా తొలి నోము పంటగా ". అని సెలవిచ్చారు.

ఆమె నవ్వ గానే పరిసరాలెలా మారాయో...
తన బ్రతుకెలా మారిందో ఆయన.....
నవ్వవె నవ్వవె సునయనా యిక నీవిటు
నవ్వుతుండగానవ్వెను చంద మామ గగనమ్మున
నీ జడలోనిపువ్వులు నుంచినవ్వ గసాగె మంద పవనంబులు
మెల్లగాచల్లగానువ్వదొడంగె నా బతుకు నవ్వులు తోటగ మారెనేచెలీ" ...అని తృప్తిగా మనసారానవ్వుకున్నారు.

అంతేకాక ఆమె మాట గురించి చెప్తూ....పనస తొనలకన్న పంచదార కన్నజుంటి తేనెకన్న జున్నుకన్న చెరుకు రసముకన్న చెలి మాట తీపురా..అని వేమన అంటే, **" ఆమె నీలి వలయంనా కళ్ళమీదికి దాడిచేసే ఒక మెడిటరేనియన్ పోయెం"** అని ఇంకారైలెక్కి పోతూంటే జ్ఞాపకం వచ్చే ఒక అనుభవం- అంటూ శేషేంద్ర 'ఆమె' పూర్తి స్వరూపాన్ని స్వభావాన్ని మన ముందు ఆవిష్కరించారు. ఆమె తనకందని నాడు

మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా సాహిత్య వేదిక, దర్పణం సాహిత్య వేదిక సంయుక్తంగా ప్రతిరోజూ ఒక అంశం ఇచ్చి కవిత్వ రచన చేయిస్తున్నాయి. కవిత్వాన్ని నిరంతరం సాధన చేయిస్తున్నాయి. కవులు రాసిన పద్యాలు, వచన కవితలు, గేయాలను విశ్లేషించి; మెరుగు పరచుకోవడానికి ప్రతిరోజూ సూచనలు, సలహాలు ఇవ్వడం జరుగుతోంది. ఈ దైనందిన కార్యక్రమంలో భాగంగా 636వ రోజు 'కలవరం' అనే అంశంపై పలువురుకవులు తమ కవితలను పంచుకున్నారు. 'కలవరం' అనే అంశంపై వచ్చిన కొన్ని కవితలను 'నేటి నిజం' పాఠకుల కోసం ప్రత్యేకంగా... -సంపాదకులు

మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా సాహిత్య వేదిక & దర్పణం సాహిత్య వేదిక వాట్సాప్ సమూహం
ఏకాంశ కవిత్వం నిర్వహణ:
-డాక్టర్ రాయారావు సూర్యప్రకాశ్ రావు, 9441046839

కలవరపాటు

అనుకున్నవి అనుకున్నట్లు
జరిగితే ఆనందమెంతో
అనుకున్న విషయాలు
సాధించాలనే అభిలాష అందరిలో
సాధించాలనే లక్ష్యం ప్రతిహృదిలో
మదిలో ఎందుకో
ఏదో తెలియని కలవరం
లక్ష్యసాధనలోజి
కొత్త అవాంతరాలేమైనా
ఎదురవుతాయని
మారుతున్న సమాజంలో
అడుగడుగునా అవాంతరాలే
ఏ సమస్య
ఎటువైపునుండి ప్రత్యక్షమోనని
మన మార్గం ధర్మమైనదని తలచినా
మనుషుల స్వార్థం ఆటంకాల కారణం
అందుకేనేమో ఆ తెలియని కలవరం
మనిషిగా స్వయంప్రభలున్నా
ప్రకాశించలేని దుస్థితి
ఏ రవి కిరణమో ప్రసరిస్తేనే
ప్రకాశిస్తామనే బేలతనం
ఏ అభయహస్తమో ఉంటేనే
విజయమనే కలవరపాటు
జ్ఞాత అజ్ఞాత హితులుంటేనే
లక్ష్యసాధనని
ఎవరూ నాకు తోడులేకుంటే
నేనెక్కడనే కలవరం మదిలో
కల ఐనా ఇల ఐనా
కలవరపాటు మదినిండా
ఏ విధాత తొలగిస్తాడో
ఈ కలవరపాటు!.

-లక్ష్మారెడ్డి పసుల

కలత

కలత చెందిన మనసు కలవరం
దాని ప్రభావం మనిషిప్రవర్తనలోనూ
ముఖం పైనా ప్రతిబింబం.
కలత చెందిన మనసుకు
లోపిస్తుంది శాంతం
పడుతూనే ఉంటుంది మనస్తాపం.
ముదిరితే వస్తుంది
మానసిక దౌర్బల్యం.
మదికి కాకుండా
చూడాలి గాయం
చేస్తుంది మనసుని
గందరగోళం.
మనసుకి ఉండదు ప్రశాంతత
చికిత్స చేయకపోతే మానసికరోగం.
ఓదార్పు మాటలతోనే తగ్గుముఖం
కోరుకుంటుంది మనసుకు ఉపశమనం
కావాలి దగ్గరి వారి అనునయం
తేవాలి సానుకూలదృక్పథం
ఉండాలి కుటుంబ సభ్యుల
సహకారం
అప్పుడే మనసు కుదురుకునే
అవకాశం
యోగాతో సానుకూల దృక్పథం
తీసుకు వస్తుంది మానసిక
స్థిమితం.
మానసిక స్థితప్రజ్ఞత ఎంతో
ముఖ్యం.
మానసిక ఆరోగ్యమే మహా
భాగ్యం.
మానసిక ఆరోగ్యంతో
జీవనప్రమాణంలో పెరుగుదల
మానసిక ప్రశాంతత తో జీవితసౌఖ్యం
ఆనందమయ జీవనానికి
పరమపద సోపానం.

- శ్రీమతి
శ్రీ చంద్రావతి
రుద్రరాజు

అలజడి

పరిస్థితులు తలకిందులు
మనస్సు కలవరం
దిక్కు తోచని పరిస్థితి
మనస్సులో అలజడి
అనాలోచితంగా తొందరపడి
తీసుకునే నిర్ణయాలు
అనర్థాల పాలు
మనస్సు కలవరమైనా
నిర్ణయాల ఊగిసలాట
మనస్సును నిర్మలంగా ఉంచాలి
సంకల్పం దృఢంగా ఉండాలి
జీవిత మర్మం తెలుసుకో
హృదయాన్ని గట్టిగా చేసుకో
ధనంలో ఇతరులతో పోటీ వద్దు
గుణం లోనే పోటీపడి గెలవాలి
కలవరం నీ నుండి నిన్నే
వేరు చేస్తుంది
తికమక పెడుతుంది
కలవరం మనకొద్దు
దానిపై కనికరం చూపొద్దు
ధ్యానం చేసుకుంటూ
మనస్సును నియంత్రించి
కలవరం లేని కలహాలు లేని
జీవిత ప్రయాణం సాగిద్దాం
అందరం హాయిగా బతికేద్దాం.

-గుండం
మోహన్ రెడ్డి

కలకాలం వద్దు

కల వరమే..
కల్ల కలవరమే..
కలవరం యువతరం
అవినాభావ సంబంధం
కలవరం కలతలకి
దారి తీయటం
కలచిన మనసుతో
తొందర పాటు నిర్ణయాలు
కుటుంబంలో విషాదాలు
కలవరం జీవితంలో ఒక భాగం
కలవర పరిస్థితిలో
ఉండాలి నిబ్బరం
నింపాదిగా యోచించి
తీసుకోవాలి నిర్ణయం
కలతలకే లొంగి
కలవరం వద్దు
తప్పులు సవరించుకుని
అడుగు ముందుకు వెయ్..
విజయం నీదే..

-మోటూరి శాంతకుమారి

తోట రాముడికి

కలలో కూడ అనుకోని
రాకుమారి వలపు
తోటరాముడిలోజి
కలవరమాయే మదిలో..
జీవితంలో చిన్నా పెద్దా కలవరాలు
ఒక సజీవచైతన్యమే
కలవరం లేని మనిషి జడుడుగానే..
కలవరంలో కారణం అన్వేషణ
అన్వేషణలో పరిష్కారం ఆలోచన
ఆలోచనలో పరిణతి సాధన
సాధనలే పరిపూర జీవనం!
సొంత కలవరం ముందు
ఇతరుల సమస్యలు చిన్నవే..
ఒకోసారి వాళ్ళకలవరం పక్కన
మన సమస్య దూదిపింజ !
బేరీజుతో తేలిపోయే సంగతి!
ఒకేవిషయం గురించి
బుర్ర పాడుచేస్కోకుండా
బుద్ధిని మరల్చేది స్థితప్రజ్ఞత!
లేకుంటే ప్రతోడు
మయసభ అనంతరం సుయోధనుడే!!.

-ఎం.వి.ఉమాదేవి

పలవరింత

పల్లవి: పదే పదే పలవరింత
పడుచుదనపు పులకరింత ఎపఎ
చరణం1: "కల" కలయేనా నిను కలిసే
తరుణమైన రాదా
కలిసే క్షణానికై
మది తహ తహ
తీరా నిను చూసాక
నే అసలు మాటాడగలనా ఎపఎ
చరణం2: యిదేనేమో కలవరం
"కల-వరం"
నా దేవి మ్రనసు మూగదౌనుగా॥ప॥

- ఉండవిల్లి
సుజాతామూర్తి

తత్తర పాటు

లేపనైనా లేపలేదే!
మోము చూపనైనా చూపలేదే
కోపకారణమేదో కూసింతనెరుగనే!
కలవరం ఎందుకు?
కావలసినది లేకపోవడం
ప్రతిహృదయం అనుభవించక తప్పదు
వాక్కు మనసునీ
కలతపరిచి కలతపెట్టి
కలగా మిగిలే భావం తట్టుకోవాలి
ఏది అందక పోయినా,
అందని ద్రాక్షే
కానీ ఆశించడం సమంజసమా?
ఆలోచన కావాలి మరి!
లేని అమ్మ
రాని అమ్మ
నిదురలో కనిపించీ కనిపించక
తప్పుకున్నప్పుడుజి
కలిగేది కలవరమే కాదు
కకావికలైన గుండెలరోదన ఎవరికెరుక
కావలసిన వారు కాదన్నప్పుడు
మిగిలేది కలవరమే
కలగా మిగిలేది దొరికితే ఒక వరం
రెంటి మధ్యా వ్యత్యాసం
ఒక పెద్ద అగాధం
ఏదో చెప్పలేని
చెప్పుకోలేనిజి
తత్తర పాటు ఎందుకు కలుగుతుందో
ఎదనడగాలి
కలవరపడని జీవి
కలలో కూడ కనిపించడు.

-కె.కె తాయారు

ఆరాటం

జీవితంలో తెలియని ఆరాటం
ఊహలకందని కోరికలమయం
అయోమయ స్థితిలో కోలాహలం
మనసులో నాట్యం చేసే మయూరం
హృదయంలో తెలియని కలవరం.
వలపుల తలపులలో వొయ్యారం
వయసులో మైమరిపించే మౌనరాగం
మనసులో గిలిగింతల కోరికల పోరాటం
మురిపించే ముగ్ధమనోహర స్వరూపం
వధూవరులు సతమతమయ్యే ఆరాటం.
సాగరమథనంలో సాగించే క్రీడ
సంసార పోరాటంలో అన్వేషణ
సమస్యలలో ఇరుక్కునే సాధన
సానుకూలతతో పరిష్కరించే మార్గం
సహచరుల సంఘీభావాన్ని చేకూర్చేది.

-గుండవరం
కొండల్ రావు

కల-వరమా!

కల-వరమాయె!
పదాల విరుపులో!
కలవరమాయే-కలయిక లో!?
సకారాత్మకం కల-వరమైతే
ఏనిముషానికి ఏమిజరుగునో!
దినదినగండం-నూరేళ్లాయుష్షు
ఆందోళనతో లోలకంలా ఊగు
కలవరపు గుప్పిట్లో చిక్కు!
ఉందేమో లక్కు-ఆశ నిరాశల
అల్లకల్లోలంగా మారు !
కంగారు పడ్తూ
మన బుర్రలను వాయిస్తూ
చెలగాటమాడే తీరు
తామేదుస్తూ ఏడ్చిస్తూ
మేకపోతు గాంభీర్యపు బతుకులు!
ఉదరంలో మొలక
ఏపుగా ఎదిగి విదేశాల్లో స్థిరం!
వృద్ధాప్యంలో
'చింతానాస్తిఖిల-తేషాం'
కూనిరాగాలు తీస్తూ
'భజగోవిందం భజ మూఢమతే'అని
సర్దుబాటు
కలవరంతో
'సేతమ్మకు చేయిస్తి చింతాకు పతకం'
అని చింతతో
కలేజాలేని బతుకులు!
అతలాకుతలపు రాజకీయాలు
కిస్సా కుర్చీలో
ఓటుపోతే సీటు గల్లంతు
అనే బేజారులో
ఎదుటివారిపై నిప్పులు!
పిల్లల పరీక్షలంటే
బేజారుతో పెద్దల కలవరం!
మనసంతా కలుషిత కాసారం!
చొక్కా లేని లల్లాయి పాటల
బికారిని చూసి
రాజుకి సంభ్రమాశ్చర్యాలు !
రేపటి గూర్చి ఆలోచించని వాడి
బతుకు ప్రశాంతం!
అనుక్షణం చింతపంతల బతుకు
బితుకు బితుకు!
ఆత్మవిశ్వాసం తో అతుకు!
శాంతి సంతోషం వెతుకు!!.

-ఎ.రాజ్యశ్రీ

మరపురానిది

జీవితంలో కొన్ని అంశాలు
మరపురావుజి
తరచూ జ్ఞప్తికివస్తూ
మనసు కలచి వేస్తూ
ఉంటాయి కొన్ని ఆనందంతో
మధుర అనుభూతులు
అనుభవాలు
కలవర పెడుతుంటాయి
మానవ జీవితంలో కలవరం
ఒక భాగమే కదా!.



-నారుమంచి వాణీప్రభాకరి

కలవరం అనేది సాగించే పయనం
గమ్యం అగమ్య గోచరం
కలవరం అనేది
కదిలించే అయోమయం
ఆగం అర్థంలేని ఆరాటం.

బ్రతుకమ్మ పద్యాలు

సృష్టిలోన పూలు స్త్రీ జాతిరూపము
ప్రకృతి మాతగాను బ్రతుకునిచ్చు
తల్లిగ బ్రతుకమ్మ తా తెలంగాణలో
దివ్యమైన బాట దేవిమాట

తీరుతీరు పూలు గౌరమ్మగను నవ
రాత్రులందు మారి చిత్రముగను
నీకు సాటిలేరు నేడు మా బ్రతుకమ్మ
దివ్యమైన బాట దేవిమాట

సంబురాలు జేస్తునంబరమ్ముగ మార్చి
నారిగణము నాడు దీరులైరి
న్యాయస్థాపనంబు నవ్విడె బ్రతుకమ్మ
దివ్యమైన బాట దేవిమాట.

ఊరువాడయాటలయ్యాల పాటలు
నూరెగుబ్రతుకమ్మలుత్సవముగజి
వనములోన మనము
జనజాతర గణము
దివ్యమైన బాట దేవిమాట

ఉద్యమాల నేలకూపిరి బ్రతుకమ్మ
రాష్ట్ర సాధనమున రాటుదేలి
మహిళలంత శక్తి మహికిని జూపగ
దివ్యమైన బాట దేవి మాట.

కల్పవల్లి సకల కళల తెలంగాణ
పుడమిపైన నేడు పూలలొల్లి
యాడుకొనును ఘనముగతివలు
సతతము
దివ్యమైన బాట దేవిమాట

-డా,సముద్రాల శ్రీదేవి
9949837743

ఉదయ ప్రార్థన

నగరానికెప్పుడు దడే
ఎండనో వాననో వింటర్ అనో
ఎలీలీతువులన్నీ తనతో
దెబ్బలాడుతుంటాయి

గూడున్న మనుషులు
గూడులేని వారి గోడు వినరని
గోడలు కట్టేశారని తెలిసి
మరీ విలపిస్తుంటుంది.

అకాల వర్షాలు తననో
తటాకం చేస్తుంటే
ఆదుకోలేక దుఃఖాన్నాపుకోలేక
తనువంతా గాయాలు చేసుకుంటుంది

నిన్నటి పూదోటలు
నేటి కాంక్రీటు హర్మ్యాలవగా
ఆకాశాన్నంటే ఆధునికత
నాలుగు చినుకులకు వణుకుతోంది

నగరం నిట్టూర్పులన్నీ
వాహనరొదతో కలిసిపోతుంటే
తన కన్నీటి చుక్క
ఏ ఒక్కగుండెను తాకినా బావుండని
ఉదయ ప్రార్థన చేస్తోంది

-సి.యస్.రాంబాబు
8374818961

ఓ మనిషీ మేలుకో!

కాలం కదులుతోంది
దీపం వుండగానే
ఇల్లు చక్కదిద్దుకోవాలి
సూర్యుడే దీపం
పగలే నడిచే కాలం
రాత్రి నిద్ర
చంద్రుని చల్లదనంలో
ఇంకాస్త ముందుకు
కదులుతోంది
గాలి పెనుగాలై వీయక ముందే
నీరు ఉప్పెనై పొంగక ముందే
పుడమి తల్లి
భారంగా కదలక ముందే
ఆకాశం మబ్బులతో
కమ్మేయక ముందే
నిప్పు దావానలంలా
రేగక ముందే
కట్టెలు పానుపుపై
పవళించే రోజు
రాకముందే
మేలుకోజి
ఆగని కాల ప్రయాణంలో
ఆగిన ఊపిరి ఆత్మ
అంతరాత్మ లో కలవక ముందే
నీ పనులన్నీ చక్కబెట్టుకో
మేలుకో ఓ మనిషీ మేలుకో!

-రావులపాటి నాగమణి,
9381690364

గారాల గని

లతా!
నువ్వు అల్లుకునే తీగవి
మనసును పెనవేసుకునే
గానలతవి
బాల్యం నిన్ను కష్టాలపాలు చేసింది
బాధ్యతలను తలకెక్కించింది
జీవితం ఎలా ఉన్నా
పాటల్లో జీవం పోశావు
నీ పాటలను
పారాయణ చేసిన
మాన్యులు, సామాన్యులు ఎందరో!
నీ కంఠంలో
ఆర్ద్రత

తియ్యదనం
ఉబికివచ్చే ఆత్మీయత
నీ పాటల అమృత ధారలో
జాలువారేది మానవ విలువలు
నీ గుండెలోంచి వచ్చే స్వరాలు
శ్రోతలను ఉబ్బితబ్బిబ్బు చేస్తాయి
పాటలతో మా గుండెల్లో
గుడి కట్టుకున్నావు
ధన్య చరితవి
లేదు నీ కీర్తికి అంతం
నిలుస్తావు ఆచంద్రార్కం
(సెప్టెంబర్ 28
లతా మంగేష్కర్
జయంతి సందర్భంగా..)

- ఆచార్య సువర్ణ అలివేలు
9100483510

అన్ని వర్గాలకు సమాన ప్రాధాన్యమిస్తున్న సీఎం కేసీఆర్: చింతా ప్రభాకర్

హైదరాబాద్, సెప్టెంబర్ 28: తెలంగాణ హ్యాండ్లూమ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్ చైర్మన్‌గా సంగారెడ్డి మాజీ ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ బాధ్యతలు స్వీకరించారు. మంత్రులు కేటీఆర్, హరీశ్ రావు సమక్షంలో హైదరాబాద్‌లో ఆయన బాధ్యతలు చేపట్టారు. ఈ కార్యక్రమానికి ఎంపీ కొత్త ప్రభాకర్ రెడ్డి, ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి, పలువురు ప్రజాప్రతినిధులు హాజయర్యారు. ఈ సందర్భంగా చింత్రా ప్రభాకర్‌ను మంత్రులు కేటీఆర్, హరీశ్ రావు అభినందించారు.

అనంతరం చింతా ప్రభాకర్ మాట్లాడుతూ.. అన్నివర్గాలకు సీఎం కేసీఆర్ సమాన ప్రాధాన్యత ఇస్తున్నారని చెప్పారు. చదువుకునే రోజుల నుంచే కేసీఆర్‌కు చేనేత కార్మికుల సమస్యలు తెలుసునని వెల్లడించారు. తెలంగాణ ప్రభుత్వం బీసీల అభ్యున్నతికి అనేక కార్యక్రమాలు చేపట్టిందని తెలిపారు.

హ్యాండ్లూమ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్‌గా చింతా ప్రభాకర్‌ను సీఎం కేసీఆర్ ఈ నెల 13న నియమించారు. రెండేండ్ల పాటు ఆయన పదవిలో కొనసాగనున్నారు. సదాశివపేటకు చెందిన చింతా ప్రభాకర్ 20 ఏండ్ల పాటు ట్రేడ్ యూనియన్ నాయకుడిగా చేనేత కార్మికుల సంక్షేమం కోసం కృషిచేశారు. 1995లో ఆయన సదాశివపేట మున్సిపల్ చైర్మన్‌గా ఎన్నికయ్యారు. 2014లో సంగారెడ్డి ఎమ్మెల్యేగా గెలుపొందారు.

కణిక

సాహిత్యం, సామాజిక సేవ, విద్యారంగ వేదిక నిర్వహిస్తున్న

'బుధవారం బాద్షా'

అడ్మిన్: రమాదేవి కులకర్ణి
పోటీ ఫలితాలు
(ప్రథమ)
నిర్వహణ: శ్రీమతి సత్య నీలిమ వలిపే
ఈ సమూహంలో చేరదలచినవారు 8985613123కి మెసేజ్ చేయవచ్చు.

బంగారు బాల్యం ...

అక్షర జ్ఞానాల అంగవస్త్రాలను
ధరించి క్రమశిక్షణగా అడుగులు
కదిపాక ... బాల్యాన్ని ఒక్కసారి
దులుపుకుంటే అరలనిండా
మరామరాలే....
తెలిసీ తెలియని తనములో
తేనె మధురిమలు గ్రోలిన బాల్యం ...
ఆటల్లో అల్లరిగా గొడవ పడినది
తొండి చేసి తోటోళ్లపై గెలిచినది ....
ఆటపాటల్లో అలరించిన మిత్రులు
అటకలెక్కి ఆడుకున్న వైనాలు ...
చూచి రాతల గందరగోళాలు
మాష్టార్లతో దెబ్బలు
తిన్న సందర్భాలు వేసవి సెలవులన్నీ
బావుల్లో ఈతలతో
పంట చేలల్లో పడి పోయి తింటూ...
చెట్టులెక్కగలవా ... గుట్టలెక్కగలవా ...
అంటూ సీతాఫలాలు ...
నేరేడు పండ్లు
తింటూ ... రైతులతో
దాగుడు మూతలాడింది ....
బాధ్యతల
బరువులను తలకెత్తుకోమంది
బహులెస్సగ చదువులు సాగిస్తూ ...
బలాదూరుగా తిరిగిన క్షణాలు ...
బాకీ పడిన చోట
అమ్మా నాన్నలు తీర్చిన ముచ్చట్లు ....
ఒక్కటేమిటి...
ఒడువని ముచ్చట్లే అన్నీ
నాటి యాతనలన్ని
నవ్వులు తెప్పిస్తుంటే
బాధ్యతల బరువులెంత
భద్రంగా చూడాలో
నా కాకమ్మ కబుర్లన్నీ
కథలోలె పిల్లలకు
చెప్పి నవ్వుల హరివిల్లులు
పూయించేవాణ్ణి అరలలో నుండి
తీసి ఆరబోసుకుంటే
బాల్యమంతా బంగారుమయమే ....

-నగునూరి రాజన్న,
కరీంనగరము (రిచ్మండ్)

శ్రీమతి ఒక బహుమతి

ఆమెతో నాది ఏడడుగులు
నడక
మూడు ముళ్ల బంధం
నూరేళ్ళ జీవితం
నేను ఆమెలో లీనం
ఆమె నాలో విలీనం
మా ఇద్దరిది జన్మ జన్మల బంధం!
నేను పోతే ఆమె ఏడుస్తదో
లేదో తెలియదు
ఆమె ఏడిస్తే నా ప్రాణాలే
విడిచేస్తా
ఆమె మౌనంగా ఉంటే
నా మనసంతా గందర
గోళం
ఆమె నవ్వితే నా గుండె
జారి గల్లంతయ్యిందే
ఆమె నా ఊపిరి
ఆమె కాదంటే నా ఊపిరి
విడిచేస్తా!
ఆమె నాతో జత కడితే
నా జీవితం ఓ స్వర్గసీమ
ఆమె ఊ....అంటే నా
గుండెల్లో గుడి కడుతా
ఆమె ఊ...హూ....అంటే
నా ప్రాణాలే విడిచేస్తా
ఆమె నాతో జత కడితే
జీవితమే కలర్ ఫుల్
ఆమె నా హృదయ కోవెల
దేవత
నా మనసంతా ఆమె జ్ఞాపకాలే
ఆమె నా ప్రేమను తిరస్కరిస్తే
నా బతుకంతా గందర
గోలమే
ఆమె నాలో లీనం
నేను ఆమెలో విలీనం
నిజం చెప్పాలంటే ఇదే
నిప్పులాంటి నిజం నిజం
ఆమెతో నాజీవితం
వెలకట్టలేని జ్ఞాపకం !

-కోణం పర్శరాములు
9959524585





మన గుండె ఆరోగ్యం మన చేతుల్లోనే!

(29 సెప్టెంబర్ 'ప్రపంచ హృదయ దినం' సందర్భంగా)

మానవ శరీరంలో హృదయం అతి ముఖ్యమైన అవయవంగా గుర్తించబడి, శరీర కణజాలానికి ఆక్సీజన్, పోషకాలను అందిస్తూనే మలిన పదార్థాలను విసర్జించుటలో దోహదపడుతుంది. ప్రపంచవ్యాప్తంగా ప్రతి ఏట 18.6 మిలియన్ల ప్రజానీకం గుండె, రక్తనాళాల రుగ్మతలైన హృదయనాళాల (కార్డియోవాస్క్యులార్ డిసీజెస్,సివిడి) అనారోగ్యాల సమస్యలతో చనిపోవడం జరుగుతున్నదని డబ్ల్యూహెచ్ఓ అంచన వేస్తున్నది. నాన్-కమ్యూనికెబుల్ డిసీజెస్, యన్‌సిడి (సంక్రమించని వ్యాధులు) వర్గంలో దాదాపు సగం మంది రోగులు హృదయ సంబంధ వ్యాధులతో చనిపోవడం సమోదు అవుతున్నది.

ప్రపంచ హృదయ దినం-2022 నినాదం:

ప్రపంచంలోని కోట్ల ప్రజలకు కోవిడ్-19 వ్యాధి ప్రాణాంతకంగా మారడం చూశాం, కొందరిని కోల్పోయాం కూడా. గుండె సంబంధ వ్యాధుల పట్ల సామాన్య ప్రజలకు అవగాహన కల్పించడానికి 'ప్రపంచ హృదయ సమాఖ్య (వరల్డ్ హార్ట్ ఫెడరేషన్)' చొరవతో ప్రతి ఏట 29 సెప్టెంబర్‌న 'ప్రపంచ హృదయ లేదా గుండె దినం (వరల్డ్ హార్ట్ డే)' పాటించుట 2000ల నుంచి ఆనవాయితీగా మారింది. ప్రపంచ హృదయ దినం-2022 నినాదంగా 'యూజ్ హార్ట్ ఫర్ ఎఫ్రీ హార్ట్' అనబడే అంశాన్ని తీసుకున్నారు. గుండె సంబంధ ఆరోగ్య అవగాహన కలిగి సమాజ హితం కోరుతూ మన గుండె జ్ఞానాన్ని పది మందితో పంచుకోవడం అలవాటు చేసుకోవాలి.

హృద్రోగాలకు కారణాలు, కట్టడులు:

అధిక రక్త పోటు, మధుమేహం, జంక్ ఫుడ్, స్థూలకాయం, పొగ తాగడం, గాలి కాలుష్యం, ఆల్కహాల్ సేవనం లాంటి కారణాలతో గుండె సంబంధ అనారోగ్యాలు కలుగుతాయి. అసంబద్ధ ఆహారపు అలవాట్లు, శారీరక వ్యాయామం పాటించక పోవడంతో కనీసం 80 శాతం గుండె జబ్బులు, గుండె పోటులతో అకాల మరణాలు సంభవిస్తున్నారు. ఆరోగ్యకర ఆహారం తీసుకోవడం, పొగాకు ఉత్పత్తులకు దూరంగా ఉండడం, పొగ తాగే అలవాటును త్యజించడం, స్థూలకాయాన్ని రాకుండా జాగ్రత్త పడడం, బిపి/షుగర్ లేకుండా చూసుకోవడం, తరుచుగా గుండె పరీక్షలు చేసుకోవడం, శారీరక వ్యాయామం చేయడం లాంటి అంశాలతో హృదయ సంబంధ వ్యాధులు రాకుండా ఉంటాయి. వ్యక్తులు, కుటుంబాలు, సమాజం, ప్రభుత్వాలు సమన్వయంతో కదులుతూ, గుండె ఆరోగ్యం పట్ల అవగాహన కల్పించాలి. ఆరోగ్యకర గుండె అందరి ప్రాథమిక హక్కు అని తెలుసుకుందాం. ప్రపంచ ఆరోగ్య సంస్థ వివరాల ప్రకారం ప్రతి ఐదుగురిలో నలుగురు హృద్రోగులు హార్ట్ అటాక్, స్ట్రోక్‌లతోనే మరణిస్తున్నారు. గుండె జబ్బులు అన్ని వయసుల వారికి వస్తున్నప్పటికీ, 50 ఏళ్ళు దాటిన వ్యక్తులలో, వయోవృద్ధులలో అధికంగా కనిపిస్తున్నాయి.

భారతీయ గుండెలు:

2025 వరకు యన్‌సిడి రోగుల మరణాలను 25 శాతం తగ్గించాలని అంతర్జాతీయ సమాజం నిర?యం తీసుకుంది. ప్రపంచ మరణాల్లో 31 శాతం గుండె సంబంధ వ్యాధులతోనే జరుగుతున్నాయని తేలింది. భారతదేశంలో 1990 వివరాల ప్రకారం 15.2 శాతం గుండె సంబంధ మరణాలు నమోదు కాగా, 2016లో 28.1 శాతానికి పెరగడం విచారకరం. ఇండియాలోని పంజాబ్, కేరళ, తమిళనాడులలో గుండె జబ్బులు అధికంగా బయట పడుతున్నాయి. హృదయ పరిపూర? ఆరోగ్యానికి మంచి పోషకాహారం, శారీరక వ్యాయామం, ఆల్కహాల్/ పొగాకులకు దూరంగా ఉండడం, స్థూలకాయం రాకుండా చూసుకోవడం, బిపి/షుగర్ సమస్యలు లేకపోవడం లాంటి జాగ్రత్తలు విధిగా తీసుకోవాలి. గుండెను ప్రేమగా చూసుకుందాం, హృదయ కవాటాలను తెరిచి సభ్య సమాజ గుండె ఆరోగ్య పరిరక్షణకు మనసారా అవగాహన కల్పిద్దాం.

- డా॥ బుర్ర మధుసూదన్ రెడ్డి
99497 00037

Printed, Published and own ed by VEENADAS, at Freedom Publications, SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500 020, Telang ana. Published at SRT-74, Jaw ahar nagar, Ashok nagar, Hyderabad-500020. Telangana. 'Editor: B. Devadas. **RNI No.52865/93.**
E-mail :netinijam93@gmail.com.